ప్రజాశక్తి

Vol. 7, no. 5

(Aug. 1, 1945)

బెజవాడ, 1945

Prajāśakti

Vol. 7, no. 5

(Aug. 1, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486

0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 1-8-45 సంచిక 5

ఇప్పుడైనా మీరు తిన్ననిమార్గమవలంబించండి!

డాక్టరు పట్టాభికి బహిరంగలేఖ

పట్టాభిగారూ!

మీరు మొన్న 19వ తేదీని బెజవాడ ఖాదీప్రదర్శనంలో ఇచ్చిన ఉపన్యాసాన్ని మొదటినుంచి చివర వరకూ నేను విన్నాను. "మద్రాసు మెయిల్", "ఆంధ్రపత్రిక", "ఆంధ్రప్రభ", "హిందూ", "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" విలేఖరులూ, అసోసియేటెడ్‌ప్రెస్ ప్రతినిధి, మీకుప్రక్కగానే ఉపన్యాస వేదికమీద, కూర్చొన్నారు. 8000 మంది ప్రేక్షకుల సమక్షంలో మీరు ఆంధ్రాసర్క్యులర్ యొక్క పుట్టుపూర్వోత్తరాలను గురించి ఉపన్యసించారు. "గాంధీజీతో చర్చించిన మీదటనే, ఆయన ఆదేశానుసారం, నేనా సర్క్యులర్‌ను సిద్ధపరిచాను. ఆ సర్క్యులర్‌లోని విషయాలు గాంధీజీతో నేను క్షుణ్ణంగా చర్చించినమీదట ఆయన నాకు తెలిపినవే", అంటూ మీరు బల్లగుద్దిచెప్పారు. పైగా, "ఆ పత్రాన్ని వార్ధాలో కాంగ్రెసు కార్యవర్గం నిర్ణయించిం"దని తెలియజేశారు. "గాంధిజీ ఉద్దేశించిన బహిరంగ విప్లవంలో పైన పేర్కొనబడిన అన్ని విషయాలు ఉన్నవి." అంటూ నిర్ధారణ చేశారు.

గాంధీమహాత్ముడు, కాంగ్రెసు అధ్యక్షుడు, ఆంధ్రాసర్క్యులర్ విషయంలో తమకెట్టి బాధ్యతలేదని ప్రభుత్వానికి జైళ్లోనుంచే ఘంటాపథంగా తెలియజేసిన తరవాత మహాత్ముని శిష్యకోటిలో ఒకరు, వర్కింగ్‌కమిటీ సభ్యులు, ఐన మీరే పైవిధంగా ఉపన్యసించడం ప్రజల్లోను, కాగ్రెసు నాయకుల్లోను గందరగోళం కలిగించింది. సభకు అధ్యక్షతవహించిన గోపాలరెడ్డిగారే మిమ్మల్ని మధ్యలో ఆపి, "ఆ ఆంతరంగిక చర్చలన్నీ యిలా బహిరంగసభలో చెప్పడమెందుకండీ?" అని వారించలేదా? దానికి మీరిచ్చిన జవాబేమిటి? "ఇందులో తప్పేముంది? ఆక్షేపణ యేముంది?" అంటూ మీరు ఉపన్యాసాన్ని కొనసాగించారు. ఉపన్యాసం పూర్తి అయాక కూడా గోపాలరెడ్డిగారు నిలబడి ఏమన్నారో ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. "పట్టాభిగారు గాంధీమహాత్మునితోను, వర్కింగ్‌కమిటీ సభ్యులతోను, జరిపిన ఆంతరంగిక చర్చలవిషయమై ఇక్కడ ప్రస్తావించడం అనవసరమని నా అభిప్రాయం." అన్నారు.

దీని అర్థం ఏమిటి? అప్పట్లో మీరు వెలిబుచ్చిన అభిప్రాయాలు ప్రజల్లో గందరగోళానికి కారణమవుతాయని సభకు అధ్యక్షతవహించిన గోపాలరెడ్డిగారే అభిప్రాయపడ్డారు. కాని, వారిని మీరు లక్ష్యపెట్టలేదు.

పోనీ, ఉపన్యాసం పూర్తి అయాకైనా పత్రికావిలేఖరులు మీవద్దకువచ్చి, "ఉపన్యాసాన్ని ఉన్నదున్నట్లుగా పంపించమంటారా?" అని అడిగినప్పుడు మీరేమన్నారో ఒకసారి జ్ఞాపకంతెచ్చుకోండి. "పంపించండి!" అని ధీమాగా మీరు జవాబుచెప్పారు. పత్రికావిలేఖరులు మరునాడు తిరుమలరావు, కాశేశ్వర్రావుగారల వద్దకువెళ్లి వారికి తాము పంపబోయే రిపోర్టును చూపినట్లు, వారు దాన్నిచదివి "సరే" నన్నట్లు, నాకు రూఢిగాతెలుసు.

దీని అర్థం, మీరిచ్చిన ఉపన్యాసంలో మీకుగాని, మీ శిష్యులకుగాని తప్పేమీ కనపడలేదన్నమాట.

కాని కాంగ్రెసువర్గాలలో కలవరం ప్రారంభమైంది. ప్రకాశం పంతులుగారు తక్షణమే మీవద్దకు బయలుదేరి, మీ ఉపన్యాసంవల్ల కలిగే ఫలితాలను వివరించి చెప్పారు. వార్ధాలో కాంగ్రెసు నాయకులు మీ వుపన్యాసం "సమయోచితంగా లేదని" అభిప్రాయాలు వెల్లడించారు. "హిందూ" పత్రికా సంపాదకులు మీ ఉపన్యాసమందలి భాగాలకూ - గాంధీజీ ప్రభుత్వానికి పంపిన జవాబునకూ ఎంత వైరుధ్యం ఉందో ఎత్తిచూపి, విశదీకరణకోసం మీవద్దకు విలేఖరిని పంపించారు.

కంభంపాటి సత్యనారాయణ

అప్పుడు మీరుకళ్ళుతెరిచారు. కాని, మీరుచేసినపొరబాటును మాత్రం గుర్తించకుండా అబద్ధాలతోను, లాయర్ ఆర్గ్యుమెంట్లతోను మిమ్మల్ని మీరు సమర్థించుకొనజూచారు; చూస్తున్నారు. ఫలితం? మరింత గందరగోళం! "తన భావమును ఆయన విశదీకరించ బూనుకోవడంవల్ల పరిస్థితులు మరింత అధ్వానమై, ప్రజలను గందరగోళ పెట్టడమే జరుగుతుంది" అని ఒక వార్ధా పరిశీలకుడన్నాడు.

మీరు మీ "విశదీకరణ"లో చెప్పిన అంశాలేమిటి? మీ ఉపన్యాసాన్ని పత్రికలు తప్పుతో ప్రకటించాయి! "సర్క్యులర్ మహాత్ముని ప్రేరణవల్లగాని, ఆయన ఎరుకతోగాని తయారు చేయబడినది కాదు. ఆయన అన్నమాట నిజమే. ఈ సర్క్యులర్ కాగితం సంగతి ఆయనకేమీ తెలియదు." (ఆంధ్రపత్రిక: 25-7-45) అంటూ మీరు సమర్థించుకొన జూచారు. కాని, మీ ప్రయత్నం అంతగా ఫలించలేదు. "సర్క్యులర్ కాగితం" సంగతి గాంధీజీకి తెలియదనడంలో, అందలి కార్యక్రమానికి గాంధీజీ అనుమతి ఉన్నదనే కదా! "ఏమైనప్పటికీ, యీ సర్క్యులర్‌లో చెప్పబడిన కొన్ని రకములైన చర్యలకు గాంధీజీ నిస్సందేహముగా జవాబుదారీ వహిస్తున్నారు". (ఆంధ్రపత్రిక 25-7-45) అంటూ మీ ఉపన్యాసాన్ని బలపరచుకొన ప్రయత్నించడంలో గాంధీ మహాత్మునిపట్ల అపచారం చేశారు.

గాంధీమహాత్ముణ్ణే కాకుండా, కొందరు వర్కింగ్‌కమిటీ సభ్యుల్ని కూడా మీరు బురదలోకి యీడ్చారు. "అక్కడ (వార్ధాలో) నేను యితర కాంగ్రెసు ప్రముఖులతో ఇష్టాగోష్ఠిగా కొన్ని విషయాలు మాట్లాడియున్నాను. ఆసంభాషణల ఫలితంగా నేను కొన్ని అంశములను గ్రహించి వాని నన్నింటిని క్రోడీకరించి, ఒక సర్క్యులర్ రూపంలో పొందుపరచి యుంటిని........నాతోపాటు యిద్దరు ముగ్గురు కంటే ఎక్కువమంది హాజరు లేరు." అంటే, వర్కింగ్ కమిటీలో కొందరు మీ కార్యక్రమానికి అనుకూలురుగా ఉన్నవారనే కదా మీ వాదన?

బందరులో జరిగిన సమావేశం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశం కాదనీ, జిల్లా ప్రతినిధుల సమావేశమనీ, రాష్ట్ర కాంగ్రెసు కమిటీ తాలూకు చిరునామా కాగితాల మీద (లెటర్‌హెడ్స్) ఆ సర్క్యులర్ వ్రాయబడుటవల్లనే, "ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ" అనే మాటలు అందులో ఉన్నాయనీ, అందువల్ల కమిటీ తరఫున జారీచేయబడిన సర్క్యులర్ కాదనీ, మీరు విశదీకరిస్తున్నారు. "సర్క్యులర్ తయారుచేయవలెననే అభిప్రాయం ఆ మీటింగు అయిపోయిన తర్వాత కలిగినటువంటిదే" నని వాదిస్తున్నారు. వివిధ జిల్లాలనుంచి జిల్లానాయకులువచ్చి పాల్గొన్న ఆ ప్రతినిధుల సమావేశం రాష్ట్రకమిటీ సమావేశం అవునా? కాదా? అనేది ప్రధానసమస్యకాదు. సర్క్యులర్ ఆసమావేశంలోనే తయారైందా, తరవాత తయారైందా? అనేది కూడా అప్రస్తుతమే. అసలు సమస్య ఏమంటే? మీరంతాకలిసి చర్చించినమీదట సర్క్యులర్ ద్వారా మీరు జారీచేసిన కార్యక్రమం దేశానికి హానికరం. దాన్ని మీరు ప్రజల్లో బాహాటంగా పంచిపెట్టడంవల్ల గాంధీజీ, వర్కింగుకమిటీ దాన్ని నిర్ణయించినట్లు ప్రజలుభావించారు. అసలు వర్కింగ్‌కమిటీ ఇలాంటి అఖిలభారత సమస్యమీద ఎట్టి సర్క్యులర్ జారీచేయకుండా మీరే ఎందుకు జారీచేయవలసి వచ్చింది?

మరోసంగతి. మీరు ఆంధ్రాసర్క్యులరును పంచిపెట్టనే లేదని ఇప్పుడు చెబుతున్నారు. కాని, బెజవాడసభలో మీరన్న వాక్యాలు యివి: "అది రహస్య సర్క్యులర్ కాదు. బహిరంగంగానే సిద్ధపరిచాను. బహిరంగంగా గవర్నమెంటు పోస్టాఫీసుద్వారా పంపించాం." జూలై, ఆగస్టు నెలల్లో (1942)అనేకవేల కాపీలు కాంగ్రెసువాదుల్లో అవి పంచిపెట్టబడ్డాయి. వీధుల్లోను, ఇండ్లగోడలమీద, రైలుస్టేషన్ల గోడలమీద అతికించబడ్డాయి. "పంచిపెట్టనేలేదు," అని మీరిప్పుడు బుకాయిస్తే, యదార్థం దాగుతుందా?

27-7-45వ తేదీ "హిందూ"లో మీరు మీఉపన్యాసాన్ని యింకా "విశదీకరించ"బోయి, మాతృభాషలో యిచ్చిన ఉపన్యాసాన్ని ఇంగ్లీషులోకి తర్జుమాచేసేటప్పుడు ఎంతటివారైనా తప్పులు రాస్తారని సెలవిచ్చారు.

అయితే పట్టాభిగారూ, (మిగతా 2వ పేజీలో)

"ప్రస్తుతం అనవసరపు చర్చ"

ఆంధ్ర సర్క్యులర్ విషయమై వార్ధాలో అభిప్రాయం

(ఆంధ్రప్రభ ప్రత్యేక విలేఖరి)

వార్ధా, జూలై 24

బెజవాడ ఖాదీ ప్రదర్శనంలో డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు చేసిన ఉపన్యాసం (ఆంధ్ర [illegible]ర్క్యులర్‌కు సంబంధించినది) సమయోచితమైనది కాదని ఇక్కడి కాంగ్రెసు వర్గాలలో అభిప్రాయపడుతున్నారు.

"తన భావమును ఆయన విశదీకరించ బూనుకోవడం వల్ల (దరిమిలాను—సం.) పరిస్థితులు మరింత అధ్వానమై, ప్రజలను గందరగోళం పెట్టడమే జరుగుతుంది." అని ఒక పరిశీలకుడు అన్నాడు.

డాక్టరు పట్టాభిని పోలిన ప్రముఖ వ్యక్తి గతించి పోయిన విషయమై అనవసరంగా యిప్పుడు మాట్లాడ పూనుకోవడమే శోచనీయం, " అని మరొకరు అన్నారు.

—'ఆంధ్రప్రభ' 26-7-1945

బ్రిటిష ప్రజావిజయం

చర్చిల్ ముఠా పరాజయం

బ్రిటిషు పార్లమెంటు ఎన్నికలలో చర్చిల్ ప్రభుత్వం పూర్తిగా ఓడిపోయింది. ప్రభుత్వ పక్షానికి మొత్తం 210 స్థానాలు మాత్రమే వచ్చాయి. వ్యతిరేక పక్షానికి 417 స్థానాలు వచ్చాయి. కార్మిక పక్షం చరిత్రలో యింత వరకు కని విని యెరుగనంతటి విజయాన్ని సాధించింది. 390 స్థానాలు సంపాదించింది. బ్రిటిషు ప్రజలు మొదటిసారి కార్మికపార్టీకి పార్లమెంటులో పూర్తిమెజారిటీని తీసుకొచ్చారు.

బ్రిటిషు సామ్రాజ్యవాదుల గుంపు, కన్సర్వేటివ్‌పార్టీ, పూర్తిగా దెబ్బతింది. క్రిందటి పార్లమెంటులో వారికున్న 358 స్థానాలకు యీసారి 185 స్థానాలు మాత్రమే మిగుల్చుకో గలిగింది. జర్మనీపై విజయం సాధించిన వెంటనే చర్చిల్ ఎన్నికలు జరుపడానికి త్వర పడ్డాడు. తాను విజయంసాధించాననే ధీమాతో చర్చిల్ బ్రిటిషు ప్రజలను ఓట్లు అర్థించాడు. ఉదాహరణకు సైనికులకు యిచ్చిన సందేశంలో ఆతడిలా చెప్పుకున్నాడు: "పార్లమెంటులో పెద్దమెజారిటీతో నేను రాగలిగితే తప్ప, నేను దేశానికి సేవ చేయజాలను"అని బెదరించాడు. కాని చర్చిల్ బెదరింపు పనిచేయలేదు. పైగా వ్యతిరేక ఫలితాలను యిచ్చింది.

"హిందూ" పత్రిక

బ్రిటిష్ ఎన్నికల ఫలితాలను గురించి 'హిందూ' పత్రిక యిలావ్రాసింది. "ప్రపంచంలో అభ్యుదయం కోరేవారంతా ఎన్నికల ఫలితాలనుచూచి సంతసించుతారు. ఏమంటే సామ్రాజ్యవాదానికి మూలవిరాట్టు అయిన బ్రిటనులో అభివృద్ధి నిరోధకశక్తులు ఓడిపోవడమంటే ప్రపంచమందలి ప్రజాస్వామిక విధానానికే పెద్దవిజయమన్నమాట". చర్చిల్ పోషలిస్టు కార్యక్రమంపేరు చెప్పి భయపెట్ట చూడటం తెలివితక్కువని ఆదివిశదపరచింది.

అది ఇంకా యిలా వ్రాసింది: "పార్లమెంటరీ ఎన్నికలలో పార్టీల అదృష్టం మారుతూండడం సహజమేసనీ, దీనికెక్కి ప్రాముఖ్యత లేదనీ - తోసివేయడం పొరపాటు. అలా చేయడం ఫలితాల ప్రాముఖ్యతను గుర్తించక పోవడమే. ఇటీవల కొన్ని యేండ్లలో బ్రిటిషు ప్రజాభిప్రాయంలో పెద్ద మార్పు కలుగుతూవచ్చింది. దానికి కారణాలున్నాయి. ఒక విధంగా కార్మికపక్ష విజయం వృద్ధుల తరంపైన యువకుల విజయమని చెప్పవచ్చు. ఈ ఎన్నికలలో 30 యేండ్లలోపు వయస్సు గలిగిన దాదాపు 70 లక్షల యువతీయువకులు మొదటిసారిపాల్గొన్నారు. ఈతరంవాళ్ల ఆర్థిక సంక్షోభంలో ఎన్నోకష్టాలనుభవించారు. యుద్ధ బాధలకు గురిఅయ్యారు. సంయుక్త జాతీయ ప్రభుత్వము జాతీయ అంతర్జాతీయ విషయాల్లో చేతగాని విధంగా ప్రవర్తించడం చూచారు. వారి కుండే భ్రమలు తొలగిపోయాయి. పోషలిస్టు సిద్ధాంతాలవైపు ఆకర్షింపబడ్డారు. సోషలిజమంటే గెస్టాపో పరిపాలన అనీ, బ్రిటిషుపౌరసత్వ హక్కులు అంతమొందుతాయనీ చర్చిల్ చేసిన బెదరింపులను వారు లెక్క-చేయలేదు. సామాజిక, ఆర్థిక పునర్నిర్మాణానికి కార్మికపక్షం సూచించిన సోషలిస్టు కార్యక్రమం వారిని ఆకర్షించింది." అని 'హిందూ'పత్రిక వివరించింది.

"ఆంధ్రప్రభ"

"ఆంధ్రప్రభ" యిలా వ్రాసింది: "అబిసీనియాను హిట్లరు స్వాహాచెయ్యడం టోరీ పార్టీ విధానాల ఫలితంగానే. స్పెయిన్‌లో ప్రజాస్వామికపు హత్యజరగడానికి బాధ్యతదీనిదే. ఆస్ట్రియా ఆక్రమణ, చెకోరాజ్య విచ్ఛేదన దీని అంధత్వ కారణంగానే. జపాన్ చైనా వాళ్లని మట్టుపెట్టడానికి వీలుగా దానికి ముడి ఇనుమును ఎగుమతికానిచ్చింది. ఫ్రాన్సు తనకు ఏమి మూడగలదోనని భయపడుతూ వుండగా, హిట్లర్‌తో నౌకావిషయిక మైన సంధిని చేసుకున్నది. సోవియట్‌రష్యాతో సకాలంలో సైనికసంధిని చేసికొనక ప్రస్తుత ప్రపంచ మహాసంగ్రామానికి దోహద మిచ్చింది......

"ఈ మారణహోమాలు మానవజాతికి తప్పవలెనన్న నూతన సాంఘిక వ్యవస్థను స్థాపించక తప్పదు. అది టోరీపార్టీవల్ల జరగదు. నిజానికి నూతన సాంఘిక వ్యవస్థ స్థాపన టోరీపార్టీ కేమి, దాని తత్వానికేమి, సర్వస్తి చెప్పడమే కాగలదు. ఈ సత్యాన్ని గుర్తించినందునే టోరీపార్టీని, దాని నాయకుడైన చర్చిల్‌ను బ్రిటిషు ప్రజలు రాజ్యాధికార భ్రష్టుల్ని చేశారు."

అధ్యక్షులు అజాద్

మద్దుకూరి చంద్రశేఖరరావు

కాంగ్రెసు అధ్యక్షులైన అబుల్‌కలాం అజాద్, కార్మికపక్ష నాయకుడైన అట్లీకి ఇలా సందేశం పంపాడు: "ఎన్నికల ఫలితాలపై బ్రిటిషు ప్రజలను భారత ప్రజానీకం తరపున అభినందిస్తున్నాను. బ్రిటిషు ప్రజలుకరడు గట్టిన సంకుచితాభిప్రాయాలను విడనాడి, నూతన ప్రపంచ మహదాశయాలను అంగీకరిస్తున్నారనితఈఫలితాలురుజువుచేస్తున్నాయి."

అజాద్ యింకా యిలా ప్రకటించారు:— "విజయంతోపాటు లేబరుపార్టీపై గురుతర కార్యభారం పడింది. గత ప్రపంచ సంగ్రామానంతరం బ్రిటిషుపరిపాలకులు చేసిన తప్పిదాలను తిరిగి వీరు చేయకుండా వుండగలరేమో చూడవలెనని ప్రపంచం నిరీక్షించుతూంది. భావిగతిని భారతదేశం ఓర్పుతో పరీక్షించగలదు.

"బ్రిటిషు ఎన్నికల ఫలితాలు ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రముఖపాత్రను వహించుతున్నాయి. బ్రిటిషు ప్రజలు ఎన్నుకొనిన వ్యక్తులకంటె కూడా, ఎన్నికలలో వారు బలపరచిన విధానాలే ముఖ్యమైనవి. బూజుపట్టిన పాత అభిప్రాయాలపై నూతన భయాలు అఖండ విజయం సాధించాయి. బ్రిటిషు ప్రజలు పాత విధానాలను, వ్యవస్థను వదలివేయ నిశ్చయించు కున్నారని ఎన్నికల ఫలితాలు రుజువుచేశాయి."

"ఆంధ్ర పత్రిక"

జులై 28 వ తేదీ సంపాదకీయంలో "ఆంధ్ర పత్రిక": "బ్రిటను ఎన్నికలలో కార్మిక పక్షమునకు లభించిన అద్వితీయ విజయమునకు సంతసింపని భారత జాతీయవాదు లుండరు. జాతీయ, అంతర్జాతీయ, పరిశీమాతశక్తులకు ఆశ్రయమైన జాతీయ ప్రభుత్వముపోయి, వ్యవస్థమైన కార్మిక ప్రభుత్వ మేర్పడుట శుభసూచకము." అని వ్రాసింది. "కన్సర్వేటివ్ పార్టీలక్ష్యములు, విధానముల యెడల బ్రిటిషు ప్రజలకు గల ప్రతికూల భావమే ఎన్నికల ఫలితములలో ప్రతిబింబించినది"అని స్పష్టపరచింది.

ప్రజా విజయం

కార్మికపక్ష విజయంపై పత్రికలు, ప్రముఖులు వెల్లడించిన అభిప్రాయాలు ఒకే విషయాన్ని తేటతెల్లం చేస్తూ వున్నాయి. ఒక మాటలో చెప్పాలంటే - బ్రిటిషు ప్రజలు సామ్రాజ్యవాదుల మోసంలోనుంచి బయట పడ్డారు; విజయం సాధించారు.

ఫాసిస్టు ప్రమాదాన్నుంచి బయటపడ్డ ప్రపంచంలో ప్రజా ప్రభుత్వాలు స్థాపించాలని ప్రజలు కోరుతున్నారు. పారిపోయిన రాజులను గ్రీసు, ఇటలీ, బెల్జియం వగైరా దేశాలలో తిరిగి సింహాసనాలు ఎక్కించాలని చర్చిల్ ప్రయత్నించాడు. స్పెయిన్‌లో ఫాసిస్టు అనుకూలుడైన ఫ్రాంకో ప్రభుత్వానికి స్వస్తిచెప్పాలని ప్రజలు కోరుతుంటే, చర్చిల్ వాణ్ణి రక్షించాలనుకొన్నాడు. పోషలిజం అదిగో! అని బెదిరించి యూరపులో ప్రజాద్రోహుల ప్రభుత్వాలనుస్థాపించి, సోవియట్ వ్యతిరేకకూటమినినిర్మించాలని చర్చిల్ కోరాడు. ప్రజాప్రభుత్వాలను స్థాపించి సోవియట్ యూనియన్‌తో మైత్రిని పెంపొందించాలని ప్రజలుకోరారు. ఇందుకే బ్రిటిషు ప్రజలు టోరీ ముఠాను ఓడించివేశారు.

యుద్ధానంతరం పూర్వంవలెనే బ్రిటనులో పరిశ్రమలపై కోటీశ్వరుల పెత్తనాన్ని సాగించాలని కోరాడు చర్చిల్. ప్రజలు ముఖ్యపరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనంచేసికొని జాతి అంతటి లాభంకొరకు వాటిని నడపాలని కోరారు. బొగ్గు, ఇనుము, రవాదార్ల ప్రభుత్వ స్వాధీనం చేసికొంటామని కార్మికపక్ష ప్రణాళిక సూచించింది. అందుకే, ప్రజలు కార్మిక పక్షాన్ని బలపరచారు.

ఈ సందర్భంలో అభ్యుదయ పాలసీని అనుసరించుతున్న కమ్యూనిస్టుపార్టీ, లిబరల్సు, కామన్‌వెల్తు పార్టీలు తగినంతమంది ఎన్నుకోబడలేదేమని కొందరు ప్రశ్నించుతున్నారు. బ్రిటిషు ప్రజల చైతన్యాన్ని ఎన్నికల ఫలితాలు రుజువుచేస్తుంటే, ఆ పార్టీలు ఎందుకు జయించలేదు? అని అడుగుతున్నారు.

కార్మికపక్షం అభ్యుదయంకోరే అన్ని పార్టీల ఐక్యతకు అంగీకరించితే, అసలు టోరీపార్టీ నామరూపాలు లేకుండాపోయేది. ఇపుడు వచ్చినన్ని స్థానాలుకూడ వచ్చేవి కావు. కాని దురదృష్టవశాత్తు కార్మికపక్ష నాయకులు అందుకు ప్రయత్నించలేదు.

కాని ప్రజలు తమ ప్రధానకర్తవ్యాన్ని గుర్తించారు. వారికి చర్చిల్‌ముఠా ఓటమి ప్రధానం. దానిని సాధించగలిగిన పక్షం ఒక్క-లేబరుపార్టీయే. ఏ యితరపార్టీలు దేశవ్యాపితంగా టోరీపక్షాన్ని ఎదిరించలేదు. కొన్నిచోట్ల పోటీచేశాయి. అందుచే చర్చిల్ ముఠా ఓటమిని ప్రధానంగా పెట్టుకున్న ప్రజాసామాన్యం ఇతరపార్టీలకు ఓటుచేయడమంటే ఓట్లను చీల్చడమని భావించారు. అందుచేతనే తక్కిన అభ్యుదయపార్టీలకు స్వల్ప స్థానాలుమాత్రమే వచ్చాయి.

ప్రజలు టోరీపార్టీని చావుదెబ్బకొట్టారు. లేబర్‌పార్టీని ఆత్యధిక మెజారిటీతో గెలిపించారు. అందువల్ల ఇది సంపూర్ణమైన ప్రజావిజయం.

(1 వ పేజీ తరువాయి)

మీ ఉపన్యాసాన్ని పంపిన "ఆంధ్రపత్రిక", "ఆంధ్రప్రభ" విలేఖరులు తెలుగువారేగా? ఆ పత్రికలు రెండూ తెలుగు పత్రికలేగా? అదీగాకుండా ఈ తద్దుమా చిక్కు- మీ ఒక్కరి ఉపన్యాసానికే వర్తించి, ఇతరుల ఉపన్యాసాలకు వర్తించదేం? 28-7-45 "ఆంధ్రప్రభ"లో మరొక "వివరీకరణ" (మీదే) ప్రచురింపబడింది. అందులో పథాధ్యక్షులైన గోపాలరెడ్డిగారు మిమ్మల్ని ఆంధ్రసర్క్యులర్ విషయమై ప్రస్తావించమని కోరినట్లు, విధిలేక మీ రలా ప్రస్తావించినట్లు, చెప్పుకున్నారు. స్వరే! అందువలన ఆంధ్ర సర్క్యులర్ యొక్క- బాధ్యత మీదేనని అంగీకరించడం పలబే; హర్షించదగ్గదే. కాని గాంధీగారి అనుమతిగాని, వర్కింగ్‌కమిటీ అనుమతిగాని, లేని కార్యక్రమాన్ని ఉన్నదంటూ బుకాయించమని గోపాలరెడ్డిగారు మిమ్మల్ని కోరలేదుగా? మీ ఉపన్యాసం మధ్యలోనే ఆయన మిమ్మల్ని ఆపి, "అంతరంగిక చర్చల విషయం ఇక్క-డెందుకు" అని హెచ్చరించారే? మీ రప్పుడు "తప్పేముంది?" అని ధీమాగా జవాబుచెప్పారే!

పట్టాభిగారూ, ఈ లాయరు ఆర్గ్యుమెంట్లు, అబద్ధాలు, ఇప్పుడైనా కట్టిపెట్టండి. మీరు బెజవాడ ఉపన్యాసంలో చెప్పిన మాటలు నోరుజారి వచ్చినవి మాత్రంకావు. మీవంటి మేధావి ఇంత ప్రధానమైన రాజకీయ సమస్యపై ఉపన్యసించేటప్పుడు నోరు జారడమనేది అసంభవం. విలేఖరుల తప్పుడు తర్జుమాలా? అంతే ఆదికాదు. కమ్యూనిస్టులు ఆగస్టు అల్లరులలో పాల్గొనకపోవడంవల్ల, దేశద్రోహులయ్యారనే ప్రచారానికి మీరుకూడా చేయూతనివ్వడంకోసంనిశ్చయించుకున్నారు. ఆంధ్రా సర్క్యులర్ గాంధీ ఆదేశానుసారం, జారీ చేయబడిందని చెప్పేస్తే, అలాంటి ఉద్యమాన్ని వ్యతిరేకించిన కమ్యూనిస్టులు కాంగ్రెసు ద్రోహులు, దేశ ద్రోహులని చౌకగా ఆడిపోయవచ్చు. ఇందుకు మీ ఉపన్యాసం ఎంతో ఉపకరిస్తుందని మీరు భావించారు. కాని, మీగుడ్డిఆవేశంలో గాంధీజీ పట్ల మీరెంత అన్యాయం చేశారో, ప్రజల్లో ఎంత గందరగోళానికి కారకులయ్యారో ఊహించలేక పోయారు. మీ భవిష్యత్తునైనా దృష్టిలో ఉంచుకోలేకపోయారు. గాంధీగారు మొన్న 28 వ తేదీని ఒక పత్రికా విలేఖరితో ఏమన్నారో తెలుసా? "డాక్టరు పట్టాభి ఏదో అన్నాడంటున్నారు. తాను అలా అనలేదని వారు రేపు చెప్పవచ్చు!" అని అన్నారు. కాబట్టి, యికనైనా మీరు గుడ్డి ఆవేశాన్ని విడిచిపెట్టి, వక్రభాష్యాలకు-అబద్ధాలకుదిగక, తిన్నని మార్గం అవలంబించండి.

అభ్యుదయ, అభివృద్ధినిరోధక, శక్తుల మధ్య ఘర్షణ

ఇరాన్‌లో యదార్థపరిస్థితి

ఇరాన్ (పర్షియా) దేశపు జనసంఖ్య 1 కోటి 50 లక్షలు. పెట్రోలు ఎక్కువగా తయారయే దేశాల్లో ఇరాన్‌ది మూడవస్థానం. 1909 లో బ్రిటిష్ పెట్టుబడితో "ఆంగ్లో ఇరానియన్ ఆయిల్ కంపెనీ" స్థాపింపబడింది. ఇందులో పనిచేసే కార్మికులసంఖ్య 65,000 ప్రతి సంవత్సరం యీపరిశ్రమవల్ల షుమారు 1 కోటి టన్నుల పెట్రోలు తయారౌతుంది. అయితేనేం? పెత్తనమంతా బ్రిటిష్ యజమానులదే. ఇరాన్ దేశీయులకు ఈకంపెనీలో ఉన్నత పదవులు లేవు. యువకుల్ని ఇంజనీరింగ్ శాఖలలో తరిఫీదు చెయ్యరు. పైనుంచి నిరియస్లనీ, యూదుజాతివారినీ, ఆరబ్బుల్ని-దిగుమతిచేసి, వారిచేత పనులన్నీ చేయిస్తారు. ఈకంపెనీ 1931 వరకూ ఇరాన్ ప్రభుత్వానికి ఒక్క- దమ్మిడీ కూడా పన్ను చెల్లించియుండలేదు.

రిజాషా అధికారం

పరిస్థితుల్లో మార్పు. తీసుకురావడానికి రిజాషా ప్రభుత్వం 1931 లో పాత ఒడంబడికను రద్దుచేసింది. కార్మికులలో 100 కి 100 మంది ఇరాన్ దేశస్థులే ఉండాలనీ, ఒక టెక్నికల్ స్కూలు వారికోసం తెరవాలనీ, షరతు పెట్టింది. ప్రభుత్వానికి ఏటేటా పన్ను చెల్లించాలని విధించింది. "ఆంగ్లో ఇరానియన్ ఆయిల్ కంపెనీ" విధిలేక వీటన్నింటికీ అంగీకరించవలసి వచ్చింది. ఐతే నేం? అది తన పాత పద్ధతుల్ని విడనాడలేదు. ప్రతి సంవత్సరం పదివేల పౌనులు ఖర్చుపెట్టి ఇరానియన్లకు తరిఫీదు యిస్తోంది. కాని తరిఫీదైన వారికి ఉన్నత పదవుల్లో స్థానంలేదు. సామాన్య కార్మికులుగానేఉండిపోయారు. కంపెనీ యజమానులు పెట్రోలునుపైకితీసి బ్రిటన్‌కి పంపడానికి కవసరమైన యంత్రసామగ్రిని మాత్రమే దిగుమతి చేసేవారు. పెట్రోలుతో రబ్బరుగాని, ఆల్కహాల్‌గాని, తయారు చేయడానికెట్టి ప్రయత్నం చేయలేదు. అందువల్ల లక్షలకొద్దీ టన్నుల గ్యాసు వృధా అయిపోయేది.

ఈ దోపిడీవిధానాన్ని ఎదుర్కొనేటందుకు రిజాఖాన్ ప్రయత్నించకపోలేదు. అయితే, పాతకాలపు ఫ్యూడల్ రాజ్యాంగవిధానాన్నే కొనసాగిస్తూ, తన సొంతపెత్తనం కింద ప్రతీదీ జరగాలని చూచాడు. ప్రజాస్వామ్య పద్ధతులంటే భయపడ్డాడు. సోవియట్ సహాయాన్ని కోరితే ఎక్కడ తన నియంతృత్వానికి భంగం కలుగుతుందోనని వెనుకాడాడు. కనుక,తాను అనుకున్నట్లుజరగడానికి హిట్లరు సహాయంతో బ్రిటిష్ పెట్టుబడిదారుల పెత్తనాన్ని నిర్మూలించవచ్చునుకొని, ఆ కిరాతకుని సహాయం అర్థించాడు.

నాజీ కుట్రలు

వెంటనే హిట్లరు ఇరాన్‌కు తన ఏజంట్లను పంపించాడు. జర్మన్ సేనలు కాకేసస్ పర్వతాలు దాటగానే, ఇండియాచేరుకొని, అక్క-డ జపాన్ సేనలతో చేతులుకలపడం హిట్లరు ఎత్తు. ఇందుకు ఇరాన్‌ప్రభుత్వం పూర్తిగా సహకారం చెయ్యడాని కంగీకరించింది. జర్మన్ గూఢచారులు ముఖ్యమైన కీలక స్థానాల్లో ఉద్యోగాలు సంపాదించారు.

ఈ కుట్ర మిత్రరాజ్య ప్రభుత్వాలకు తెలిసింది. వెంటనే - అనగా 1941 లోనే, ఎర్రసేనలు ఉత్తర ఇరాన్‌లో ప్రవేశించాయి. దక్షిణభాగాన్ని, అనగా పెట్రోలు గనులన్నీ ఉన్న భాగాన్ని బ్రిటిష్ సేనలు స్వాధీనం చేసుకున్నాయి. రిజాషా దేశం విడిచి పారిపోయాడు.

బ్రిటిష్‌వారి పాలసీ

దక్షిణభాగంలో బ్రిటిష్ సేనలు ప్రవేశించి నప్పటినుంచీ అక్క-డి ప్రజల్ని చీలదీసి తమ పెత్తనం సుస్థిరం చేసుకోడానికి ఎన్నో ఎత్తులు ప్రారంభించారు. ఇరాన్ దేశస్థులకు వేరేక్లబ్బులు నిర్మించి, వారిని తమ క్లబ్బులలో అడుగుపెట్టనిచ్చేవారు కారు. తమ కంపెనీయొక్క- ఎకౌంట్సు డిపార్టుమెంటులో దక్షిణభారతీయులకే అన్ని ఉద్యోగాలు యిచ్చారు. పాలెస్టయిన్ నుంచి కొంతమంది విద్యార్థుల్ని తీసుకొచ్చి ఒక్కొ-కరికి నెలకు రు. 1000 ల వరకు జీతాలిచ్చారు. వారందరికీ ఉచిత భోజనవసతులు, బసలు ఏర్పాటు చేశారు. ఇరాన్ దేశస్థులకు యివన్నీ లేవు. నెలకు రు. 400 లు కంటె వారికి జీతాలు లేవు.

ఈ విధంగా ఇరాన్‌లో యీరోజున బ్రిటిష్ గుత్తవ్యాపారస్థులు ఒక జాతి మీద మరోజాతిని ఎక్కించి, తాము దోపిడీ విధానాన్ని విచ్చలవిడిగా కొనసాగించుతున్నారు.

బ్రిటిష్‌వారు నోరులేని ఇరాన్ ప్రజల్ని అనేక యిబ్బందులకు గురిచేస్తున్నారు. సివిలియన్ల ఉపయోగానికి పెట్రోలు సప్లయి లేదు. ఆహారధాన్యాల్ని దౌర్జన్య పద్ధతులతో రిక్విజిషన్ చేస్తున్నారు. విలవ్యాపారస్థులకు మంచి అవకాశాలు దొరికాయి. ఒక్కొక జోళ్ళజత ఖరీదు రు. 200 వరకు పెరిగిపోయింది. బట్టల సమస్య చూస్తే మరీ ఘోరంగా తయారైంది. బెంగాల్‌లో ఇప్పుడు మనం చూస్తున్న బట్టలకరువు ఇరాన్‌లో బ్రిటిష్ ఆక్రమణ జరిగిన మొదటి సంవత్సరంతో పోలిస్తే, చాలా మెరుగనిపిస్తుంది! ఇరాన్ దేశపు స్త్రీలు స్వేచ్ఛగా రోడ్డుమీద నడవడానికి భయపడేవారు;

సోవియట్ ఆక్రమితప్రదేశంలో

కాని, సోవియట్ ఆక్రమిత ప్రదేశంలో పరిస్థితులువేరు. ఆహారపదార్థాలన్నీ చౌకగా దొరుకుతున్నాయి. విలవ వ్యాపారస్థులపట్ల కఠినమైన దండనీతి అమల్లో వుండడంవల్ల ప్రజలు ధైర్యంగా వారిని ఎదుర్కొ-న్నారు. టెహరాన్‌వంటి ముఖ్యపట్టణాలలో ప్రజాసంస్థలే జీవితావసర వస్తువుల పంపకంమీద అధికారాన్ని కలిగియున్నాయి. ఎవరైనా నిల్వవ్యాపారం చేస్తున్నట్లు ఆచోకీ దొరికితే, వెంటనే అట్టి సరుకును వీధుల్లోకితెచ్చి, ఉచితంగా ప్రజలకు పంచిపెట్టారు అందువల్ల, మొదటి రోజుల్లోనే విలవవ్యాపారం మాయమైంది. ఇరాన్ దేశస్థులపట్ల ఎర్రసైనికులు గౌరవమర్యాదలతో ప్రవర్తిస్తున్నారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నారు.

రాజకీయంగా ఇరాన్‌లో ఒక నూతన చైతన్యం ఆవిర్భవించింది. కార్మిక సంస్థలు, రాజకీయపార్టీలు బయల్దేరాయి. వాటిలోముఖ్యమైనవి "ఫ్రీడమ్‌ఫ్రంట్," "పీపుల్స్‌పార్టీ"లు

ఈపార్టీలు అన్నివర్గాల కోర్కె-లను ప్రతిబింబిస్తాయి. కార్మికుల పరిస్థితిని, రైతుల పరిస్థితిని, బాగుచేయడానికి కంకణం కట్టుకొని పనిచేస్తున్నాయి.

సోవియట్ కోర్కెలు

భూగర్భంలో దాగిఉన్న సహజసంపదను పైకితీసి, అభివృద్ధి చేయడానికి యంత్రసామగ్రి, ఇంజనీరింగ్ నిపుణులు ఇరాన్‌లో లేరు. పెట్టుబడికూడా స్వల్పం. ఈ పరిస్థితుల్లో సోవియట్ ప్రభుత్వం ఇరాన్ నూనెగనుల అభివృద్ధికి పూనుకుంటానని సూచించింది. అందుకు కొన్ని షరతులు కోరింది. ఏటేటా తయారుకాబోయే పెట్రోలులో సగం మాత్రమే సోవియట్ తీసుకుంటానని చెప్పింది. కంపెనీయొక్క- టెక్నికల్ కార్యకలాపాలమీద, వర్తకంమీద, ఇరాన్ ప్రభుత్వానికే పూర్తిపెత్తనం ఉంటుందని హామీ యిచ్చింది. ఇరాన్ దేశస్థుల్ని మంచి నైపుణ్యంగలవారుగా తరిఫీదు చేయడానికి పాఠశాలలు, పరిశోధనాలయాలు, నిర్మించడానికి వాగ్దానం చేసింది ఇరాన్ దేశస్థులకే ఉద్యోగాలన్నీ యిస్తామని తెలియచేసింది. కార్మికుల స్థితిగతుల్ని బాగుచేయడానికి ప్రత్యేక రక్షణలుంటాయని చెప్పింది. గడువు పూర్తికాగానే యంత్రసామగ్రిని, పాఠశాలలను, పరిశోధనాలయాలను, ఇరాన్ ప్రభుత్వానికి స్వాధీనం చేస్తానంది.

ఇంత చక్క-ని షరతులతో సోవియట్ ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ, ఇరాన్ పాలకవర్గం వాటిని తోసిపుచ్చింది. ఇందుకు కారణం ఏమిటి?

"పీపుల్స్‌పార్టీ" పత్రికయైన "రహబార్" యిలా వ్రాసింది: "బ్రిటిష్, అమెరికన్ ప్రముఖులతో ఇప్పుడు రహస్యంగా జరుగుతున్న చర్చలు - పెట్రోలు ఉత్పత్తిని గురించి పరిశోధనలు చేయడానికి పెద్దపెద్ద అమెరికన్ టెక్నీషియన్ల నియామకం - సయ్యిద్ ప్రభుత్వం మొదట ఒప్పుకొని తరవాత అకస్మాత్తుగా సోవియట్ సూచనలను తిరస్కరించడం - ఇవన్నీచూస్తే, సయ్యిద్ ప్రభుత్వం విదేశీ రాజకీయ ఏజంట్ల చేతుల్లో కీలుబొమ్మగా తయారై, ఫాసిస్టు విధాన మవలంబిస్తున్నట్లు స్పష్టమవుతూంది."

నిరంకుశ విధానం

ఈమధ్య సయ్యిద్ ప్రభుత్వంపోయి మరొకొత్త ప్రభుత్వం అధికారానికి వచ్చింది. కాని, ఇదికూడా బ్రిటిష్ ఏజంట్ల చెప్పుచేతల లోనేవుంది. నిరంకుశ పద్ధతులవలంబిస్తోంది. "రహబార్" పత్రికను నిషేధించింది. నవంబరు 7 వ తేదీని (1944) వివిధ ప్రజాసంస్థల యాజమాన్యాన "రష్యా విప్లవ దినోత్సవం" జరపడానికి కలిసి కార్యక్రమం వేసుకొంటూంటే, పోలీసులు - సిపాయిలు వచ్చి అందరినీ అరెస్టుచేశారు కార్మికసంఘ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరొకరోజున 20 వేలమంది ప్రజాసామ్యం పార్లమెంటు భవనానికివెళ్ళి, సోవియట్ సూచనలను అంగీకరించమని డెప్యుటేషన్‌గా వెళ్ళితే, సైన్యాధికారులు మరఫిరంగులు తీసుకొచ్చి ఎదురుగాపెట్టారు. అప్పుడొక సోవియట్ అధికారి జోక్యం కలిగించుకొని యుండకపోతే, రక్తపుచేరులు ప్రవహించి యుండేవి. జులై 11 వ తేదీని టెహరాన్‌లో ఒక సోవియట్ ప్రతినిధి బహిరంగసభలో ఉపన్యసిస్తూంటే, ప్రభుత్వోద్యోగులు విద్యుద్దీపాలన్నీ ఆర్పివేశారు. కార్మికులెప్పుడు సమావేశాలు జరుపుకొంటున్నా, యిలాగే దీపాలు ఆర్పివేయడం మామూలైంది!

ఈ రోజున ఇరాన్‌లో అభ్యుదయశక్తులకూ - నిరంకుశాధికార వర్గానికి మధ్య తీవ్రమైన పోరాటం జరుగుతోంది. "ప్రవదా" పత్రిక రాసినట్లు,

"ఇరాన్‌లో యీరోజున రైతులకు భూములేవు; కార్మికులు అనేకవిధాల పీడించబడుతున్నారు. ఎన్నికల పద్ధతిలో మార్పులేదు. పాతకాలపు విద్యావిధానమే ఇంకా అమల్లో ఉంది. 1941 లో దేశం విడిచి పారిపోయిన రిజాషా క్రింద ఏఅధికారవర్గం ఉండేదో వారిలోచాలామంది యిప్పటికీ ఉన్నారు. న్యాయశాస్త్రంలో కూడా మార్పులేమీ తీసుకురాబడలేదు."

ఈ విధానంపోయి, చక్కని ప్రజాస్వామ్య పరిపాలన నెలకొల్పబడాలని ఇరాన్ ప్రజలు వాంఛిస్తున్నారు. కాని "ఆంగ్లో ఇరానియన్ ఆయిల్ కంపెనీ" యజమానులు అమెరికన్ అధికారుల సహకారంతో, సోవియటు ప్రభుత్వం ఇరాన్ దేశంయొక్క- స్వాతంత్ర్యాన్ని హరించ జూస్తోందని అబద్ధపు ప్రచారంచేస్తున్నారు. నిజ- చెప్పాలంటే, వీరే ప్రస్తుత ప్రభుత్వాన్ని, ఆప్రభుత్వ మవలంబించే నిరంకుశ విధానాన్ని, ప్రోత్సహిస్తున్నారు. వీరంతాకలిసి ఇరాన్‌లో కొత్తగా బయలుదేరిన ప్రజాస్వామిక పోకడల్ని, అభివృద్ధి కోరే జాతీయ పక్షాలను, కార్మిక సంఘాలను,అణచివేయాలని చూస్తున్నారు. సోవియట్ ప్రభుత్వము కోరిన షరతులకు ఇరాన్ అంగీకరిస్తే, దేశంలో ప్రజాస్వామ్యశక్తులు ఇంకా విజృంభిస్తాయని వీరిభయం. బ్రహ్మాండమైన పెట్రోలు పరిశ్రమను ఇరానియన్లు స్వయంగా నడుపుకోగల శక్తివంతులౌతారనీ. అప్పుడు "ఆంగ్లో ఇరానియన్ ఆయిల్ కంపెనీ" యొక్క- గుత్తఅధికారాలన్నీ పోతాయనీ, వీరికి తెలుసు. కనుకనే వీరు ఫ్యూడల్ పరిపాలకవర్గాన్ని బలపరుస్తూ ప్రజోద్యమాల మీద ధ్వజం ఎత్తుతున్నారు.

ఇదీ అసలు సంగతి!

—'పీపుల్స్‌వార్' నుండి.

దొంగ మార్కెట్లు

నిడదవోలులో లోగడ బియ్యం, బట్టలు కిరసనాయిలు దొంగమార్కెట్లో అమ్ముతున్నందుకు చిట్టూరి శేషయ్య అండ్ సన్సు వారికి రు. 900, మండవల్లి అప్పారావు అండ్ సన్సువారికి రు. 500, కొమ్మూరి వీరభద్రయ్య అండ్ సన్సువారికి రు. 200, చెల్లూరి వీరనాగయ్యకు రు. 200 – జరిమానాలు విధించబడ్డాయి. అయినా, వర్తకులు దొంగవ్యాపారం మానలేదు. స్టాండర్డ్ వాక్యూం ఆయిల్ కంపెనీ ఏజంటు కోడూరి విశ్వనాథం నాలుగు కిరసనాయిలు డబ్బాలు రూల్సుకు వ్యతిరేకంగా తూర్పుగోదావరి జిల్లాకు ఎగుమతి చేస్తూంటే, కమ్యూనిస్టులు చూచి పట్టుకున్నారు. మడివల్లి సత్యనారాయణ అనే మరొక వర్తకుడు తెల్లకాగితాలు హెచ్చు ధరకు అమ్మినందుకు, చిన్ని జగన్నాధం రంగునూలును దొంగమార్కెట్లో అమ్మినందుకు, కొత్త వెంకట సుబ్బారావు తన మేడమీద బట్టలుదాచి అధిక ధరలకు అమ్మినందుకు, స్థానిక కమ్యూనిస్టులు ప్రభుత్వానికి ఫిర్యాదుచేశారు. అహమ్మదియా రైస్‌మిల్లు కంట్రాక్టరు గోరింట జగపతి రామరాజు కృష్ణకాటుకల బియ్యం కిచిలీ బియ్యమనిచెప్పి అరేలు వసూలుచేస్తున్నారు. (ఏరకపు బియ్యమో స్పష్టంగా చెప్పకుండా, రసీదులలో "కి" బియ్యం అని వ్రాస్తున్నారు) ఈ మోసాన్నికూడా ప్రభుత్వానికి తెలియ చేయడమైంది.

ప్రస్తుతం కో-ఆపరేటివ్ స్టోర్సుకు కార్యదర్శిగావున్న ఎస్. రామానుజాచారి క్రిందటి నెల 9, 10 తేదీలలో 14 బస్తాల మైదాపిండి తెచ్చి, అందులో 3 బస్తాలు రాజమండ్రికి పంపినట్లు, 4 బస్తాలు స్థానిక వర్తకులకు బస్తాలవారీగా యిచ్చినట్లు కమ్యూనిస్టులకు తెలిసింది. వెంటనే, అనగా 13-7-45 న నిడదవోలులో మకాం చేసిన కమర్షియల్ టాక్సు ఆఫీసరుతో యీ విషయం ఫిర్యాదు చేసి, స్టోర్సును సోదా చేయించారు. స్టోర్సు బయట స్టాకు ఎంతవుందో తెలియజేసే బోర్డు లేదు. లోపలవున్న బోర్డుమీద ఆరోజు ఎంత స్టాకువుందో చెప్పక 10-7-45 న ఎంతస్టాకు ఉందో తెలియజేసే వివరాలున్నాయి. రికార్డులు చూస్తే, కొన్నవారి సంతకాలు లేనే లేవు. మనిషి 1కి ఒక్కొక్క వీసె మైదా యిచ్చినట్లు ఒకే దస్తూరితో పేర్లు ఉన్నాయి. అమ్మకం పుస్తకంలోని ఖర్చుకూ, సరుకు నిల్వకూ సంబంధం ఎక్కడా లేదు. నిడదవోలు వాస్తవ్యులు "స్టోర్సులో 10 వ తేదిలగాయతు 13వ తేదీలోగా మైదాకొన్నట్లు కనీసం ఒక్కరినైనా చూపలేము" అని స్టోర్సుగుమాస్తా శ్రీరామమూర్తి, నేల్సుమన్ పాపారావు స్టేట్‌మెంట్లు యిచ్చారు. "స్టోర్సు సెక్రటరీగారు మైదాపిండి బస్తాలు నాల్గింటిని నిడదవోలు రొట్టెల వర్తకులకు అమ్ముచుండగా తాను చూచితి"నని ఉపిరిలి రామయ్యగారు స్టేటుమెంటిచ్చారు. ఆ యా తేదీలలో మైదాపిండిని తాము కొనలేదు అని ఇల్లూరి వీరన్న, షేక్ మీరామొహిద్దీన్ గారలు, మరి కొందరు వ్యక్తులు కమర్షియల్‌టాక్సు ఆఫీసరుగారికి స్టేట్‌మెంట్లిచ్చారు.

ఈ విధంగా నిడదవోలు కమ్యూనిస్టులు ప్రజా సమీకరణచేసి, ఉద్యోగుల సహకారముతో దొంగమార్కెట్లను బట్టబయలు చేస్తూవుంటే, స్వార్థపరులైన దొంగ వ్యాపారస్తులు కమ్యూనిస్టు వ్యతిరేక ధ్వజంఎత్తారు. క్రిందటి నెల 17 వ తేదీన రైస్‌మిల్లు యజమానులు, బియ్యం వర్తకులు కలసి ఒక సమావేశం జరిపారు. ఆగష్టు 15 వ తేదీ లోగా వున్న సరుకును అమ్మివేసి, కొంతకాలం వరకూ బియ్యం తెచ్చి అమ్మకూడదని నిర్ణయించుకొన్నారు. ప్రజల్ని ఈ విధంగా గగ్గోలు పెట్టితేగాని పరిస్థితులు తమ కనుకూలంగా మారవని వీరి నమ్మకం. ప్రభుత్వం వెంటనే ఈ విషమ పరిస్థితిని గమనించి, తగువిధంగా చర్య తీసుకోవలసివుంది. నిలవ వ్యాపారస్తుల బెదిరింపులకు లొంగిపోతే, ప్రజలకు అపకారం చేసిన వారౌతారు.

★

పాలకొల్లులో

లోగడ పాలకొల్లులో కష్టైలకు కరువు ఏర్పడింది. వర్తకులు ఎక్కువ ధరలకు అమ్మి, లాభాలు గుంజుకుంటున్నారు. దీన్ని నివారించడంకోసం స్థానిక కమ్యూనిస్టులు రివెన్యూ అధికారుల సహకారంతో డిపోల వద్ద నిలబడి, సరుకు సక్రమంగా అమ్మునట్లు చూస్తున్నారు. 15-7-45 వ తేదీన మంతిన అప్పలస్వామి అనే వర్తకుడు ఒక్కొక్క కుటుంబానికి వారానికి ¼ షట్టి చొప్పున యివ్వవలసియుండగా, బంగారు జగన్నాధ రామకృష్ణారావుగారికి 13 పుట్లు, జావ మూలయ్యగారికి 6 పుట్లు, అమ్మినందుకు రివెన్యూ ఇన్‌స్పెక్టరుగారు కేసుపెట్టారు. మొగల్తూరు నుండి ఇద్దరుటోకువర్తకులు, ఇంటి వెంకన్న-అయితం వెంకట నరసయ్య అనువారలు, సుమారు 90 పుట్ల కష్టై 3 పడవలలో తీసుకువచ్చి, కంట్రోలు ధరకంటె ఎక్కువ ధరకు అమ్మ ప్రయత్నించారు. వాలంటీర్లకు యిది తెలిసింది. వెంటనే రివెన్యూ ఇన్‌స్పెక్టరుగారు అక్కడికివచ్చి, కంట్రోలు ధరకే చిల్లర వర్తకులకు సరుకంతా అమ్మునట్లు చేశారు.

16–7–45 న తహసిల్దారు, రివెన్యూ ఇన్‌స్పెక్టరు కలిసి కారుమూరి వెంకటరమణ అనే బట్టలవర్తకుని యిల్లు సోదాచేస్తే ఒక మల్లుతాను దొరికింది. 2 ఎక్కౌంటు పుస్తకాలను తహసిల్దారు తీసుకువెళ్లారు.

★

నిడమలూరులో

ఒంగోలు తాలూకా నిడమలూరులో కసమర్లపూడి సుబ్బయ్యశ్రేష్ఠిగారికి ఒక లైసెన్సు బట్టల అంగడి వుంది. 17-7-45 తేదీని బెజవాడ సుబ్బయ్యఅనే కార్మికుడు ఒకగజంమల్లు గుడ్డ కొనడానికి వెళ్ళితే, గుడ్డయిచ్చి, సీలింగ్ రేటు కంటే ఎక్కువగా (గజం 1 కి 0-11-4 చొప్పున అమ్మవలసినది 1-1-0 రేటుకు) సొమ్ము తీసుకున్నాడు. ఈ విషయం బెజవాడ సుబ్బయ్య రైతుసంఘ ప్రచారకులతో చెబితే వారు కొట్లకు వెళ్ళి పంచాయిషీ అడిగారు. అప్పుడు కొట్లో సుబ్బయ్యశ్రేష్ఠిగారి తమ్ముడు, గుమస్తా, వున్నారు. రు. 10 సరుకు కొంటే 2 గజాల మల్లు కంట్రోలు రేటుకు యిస్తామని, సేల్సుటాక్సు ఆఫీసరు ఆ విధంగా చెప్పాడని, పై వారిద్దరూ బుకాయించారు. తీసుకున్న సొమ్ముకు బిల్లు ఇవ్వమని రైతు సంఘ సర్కార్లు ఒత్తిడి చేశారు. వారు ఇవ్వ నిరాకరించారు. బెజవాడ సుబ్బయ్య రైతు సంఘ కార్యదర్శితోమాట్లాడి, జరిగినసంగతి అంతా పైకి రిపోర్టు చేయడానికి సిద్ధపడ్డారు. వర్తకులు ఇది గమనించి, దిగివచ్చారు. సీలింగురేటుకంటె అదనంగా వసూలు చేసిన సొమ్మును వాపసుయిచ్చి, ఇకముందు సీలింగు రేట్లకే సరుకు అమ్ముతామని హామీయిచ్చారు.

కలరా నివారణలో

కమ్యూనిస్టు - కాంగ్రెసువాదుల సమిష్టికృషి

అంగలూరు(గుడివాడతాలూకా) గ్రామంలోని కూలీపేటలలో కొద్దిమందికి కలరా తగిలింది. నెమ్మదిగా గ్రామంలోకి వ్యాపించింది. రోజుకుఒకరుచొప్పునచనిపోతున్నారు. దుగ్గిరాల శేషాద్రిగారి కుమారుడు శ్రీహరి గారికి కలరా తగిలి చనిపోయారు. శవాన్ని తీసుకు వెళ్ళుటకు యెవ్వరూ రాలేదు. స్థానిక కమ్యూనిస్టులు కుర్రవాని తండ్రి వగైరాలకు ధైర్యంచెప్పి, యిద్దరు ముగ్గుర్ని ప్రోగుచేసి, శవాన్ని మోసుకు వెళ్ళారు. దహనమునకు పుల్లలు వగైరా తీసికొని వెళ్లుటకు వెట్టివారు రాలేదు. వెంటనే స్థానిక కమ్యూనిస్టులు పిడకలు వగైరా సాధనాలు శ్మశానవాటికకు చేర్చారు. దహనం జరిగింది.

మర్నాడు మరొక పిడుగువంటి వార్త. ఒక రెడ్డికులంలోని కూలీకి కలరాతగిలి 20వ తేదీని చనిపోయాడు. మన్నుచేసే దిక్కు యెవ్వరూ లేరు. చుట్టుపట్ల యిండ్లవారు భయకంపితులయారు. శవాన్ని తీయించవలసినదని గ్రామ మునసబుగారికి చెబితే, ఆయన అశ్రద్ధచేశాడు. గొయ్యితీయుటకు మామూలు యిస్తేగాని, వెట్టీలు రామన్నారు. వెంటనే కమ్యూనిస్టులు ప్రజలవద్ద రెండురూపాయలు ప్రోగుచేసి వెట్టీలకుయిచ్చారు. కాని శవాన్ని మోసుకు వెళ్లుటకు యెవ్వరూ రాలేదు. రామారావు పంతులుగారు (కాంగ్రెసు) సుందర రామయ్య పంతులుగారు, మరి యిద్దరు కమ్యూనిస్టులు కలసి శవాన్ని మోసుకు వెళ్ళి పాతిపెట్టారు.

కాని, కలరాకేసులు యెక్కువ అవుతూనే వున్నాయి. శానిటరీ యిన్‌స్పెక్టరు కొరకు గుడివాడ కబురుచేశారు. ఇనస్పెక్టరువచ్చారు. వారిని రప్పించుటలోను, యింజెక్షన్‌లుఇప్పించుటలోను దుగ్గిరాల పిచ్చయ్యగారు (నాన్ పార్టీ) యెక్కువ బాధ్యతగాపనిచేశారు. పీ. టి. సుబ్రహ్మణ్యంగారు (కాంగ్రెసు) స్థానిక కమ్యూనిస్టులు కలిసి యింటింటికీ తిరిగి రెండుమూడు రోజులలో సుమారు 2,200 మందికి యింజెక్షన్‌లు యిప్పించారు. ఇప్పటికి (24-7-45) 20 మందికి తగిలి, 10 మంది చనిపోయారు. కాని, ఇంజక్షన్‌లు యిప్పించిన తర్వాత వ్యాపించకుండా, నిలబడి ఉంది.

ఆది ఆంధ్రనాయకుని

అస్తమయం

★

కృష్ణాజిల్లా షెడ్యూల్డ్‌జాతుల ఫెడరేషన్ నాయకుడు పిడిగే వెంకటసుబ్బయ్యగారు బర్మాదేశములో విద్యను పూర్తిచేసి, అక్కడ నిమ్నజాతులు పడే బాధలను గూర్చి తీవ్ర కృషిచేసి, స్వదేశమున కరుదెంచినారు. పిదప కృష్ణాజిల్లా నాయకుడుగా, సర్వవిధముల వెనుకబడియున్న నిమ్నజాతులలో ప్రబోధము కలిగించినారు. గవర్నమెంటుతో ఉత్తరప్రత్యుత్తరములు - రాయబారములు నడిపి, స్వజాతీయులకు సేవ జేసినారు. చాలా కాలము బందరు మునిసిపల్ కౌన్సిలరుగా, గౌరవ మేజస్ట్రేటుగా ఉండి నిమ్నజాతీయులకు స్థానికసంస్థలైనా తగినంతగా తోడ్పడుట లేదే యని వాపోయినారు.

తిన తిండి, కట్ట బట్ట, ఉండ యిల్లు-లేని నిమ్నజాతీయులలో పుట్టినవారు నాయకులైనప్పటికి ఆర్థికదుస్థితిలేకుండునా? అదుస్థితిలోనే వెంకట సుబ్బయ్యగారు స్వర్గీయులైనారు. వారికుటుంబానికి సానుభూతిని తెలియ జేయుచున్నాము.

—నందనార్ హరి, ఆంధ్రరాష్ట్ర షెడ్యూల్డ్ జాతులఫెడరేషన్ మాజీ ప్రధానకార్యదర్శి.

ఆశీర్వాదాలు

★

చిరంజీవి సుందరయ్యను దీవించి వ్రాయునదేమంటే

నాయనా:

మాకు రాజకీయాలు తెలియవు. అప్పుడపుడు జిల్లా మహిళాసంఘంవారొచ్చి దేశ పరిస్థితులు, యితరదేశ స్త్రీల జీవితం - వారి అభివృద్ధి-మొదలగు విషయాలు చెప్పినపుడు విన్నాం. తరువాత మావూళ్ళో యువజన సంఘంవారు వయోజన పాఠశాలపెట్టి చదువు చెబుతుంటే, మా అమ్మాయిలు కొద్దిగా చదవటం నేర్చుకున్నారు. అప్పటినుండియు వారు "ప్రజాశక్తి"చదవటం నేర్చుకొని, చదివి వినిపించేవారు. మీ పార్టీచేసే ప్రజాసేవవిన్నాము. మా అబ్బాయిలు మీ పార్టీలోచేరి చేసే ప్రజాసేవ కళ్ళారా చూశాము. తెనాలి రైతుమహాసభకు కుటుంబంతోసహా వచ్చాను. సభ చూశాం. అచట యింకా బాగా మీ దేశభక్తి, ప్రజాసేవ ఆచరణలోచూశాం. "ప్రజాశక్తి" ద్వారాఎన్నో మంచివిషయాలు తెలుసుకున్నాం. ఆ "ప్రజాశక్తి" దినపత్రిక అవుతుందని తెలుసుకొని, ఎంతోఆనందించాం. మీరుఆపత్రికకు 5 లక్షలు కావాలని చేసిన విజ్ఞప్తి చదివి వినిపించారు అమ్మాయిలు. మా శక్తికొంది సహాయం చేయాలనుకొని "ప్రజాశక్తి"కి, నిన్ను ఆశీర్వదిస్తూ రు. 25—0—0 లు పంపుతున్నాం.

మామిళ్ళపల్లి సుబ్బమ్మ
(పమిడిపాడు మహిళాసంఘ సభ్యురాలు.)
పమిడిపాడు, 20–6–45.

9 వ నెలజీతం రద్దుచేయాలి

కర్నూలు మునిసిపల్ హైస్కూలువిద్యార్థుల విజ్ఞప్తి

పట్టణ సంయుక్త యువజన సంఘం, పట్టణ విద్యార్థి ఫెడరేషన్‌ల యాజమాన్యాన కర్నూలులో 20-7-45 వ సాయంత్రం బహిరంగ సభ జరిగింది. సభకుముందు సుమారు 70 మంది యువకులు, విద్యార్థులతో "మునిసిపల్ హైస్కూలులో 9 వ నెలజీతం రద్దుచేయాలి; టీచర్లకు సక్రమంగా జీతాలివ్వాలి; అన్ని హైస్కూళ్ళలో సీట్ల సంఖ్యను హెచ్చించాలి; విద్యార్థి సంఘాలకు జై; యువజన సంఘాలకు జై" అను బావుటాలతోను, నినాదాలతోను ఊరేగింపు జరిపారు.

తరువాత ఎస్. నాగప్ప (కాంగ్రెసు ఎం. ఎల్. ఏ.) గారి అధ్యక్షతక్రింద బస్సుస్టాండు మైదానంలో బహిరంగ సభ జరిగింది. సుమారు 300 మంది విద్యార్థులు, 200 మంది యువకులు, పురజనులు సభకు హాజరయ్యారు.

పురజనుల తరఫున కె. రామచంద్రరావు బి. ఏ బి ఎల్. గారు మాట్లాడారు. మునిసిపాలిటీ పరిపాలనావద్ధతి పురజనులకు ఉపయోగకరంగా లేదనియు, మునిసిపల్ హైస్కూలుద్వారా లాభంపొందుతున్న మునిసిపాలిటీ మరల క్రొత్తగా విద్యార్థులపైన 9 వ నెలజీతం వేయడం అన్యాయమనియు వెంటనే దానిని రద్దుచేయాలనియు చెప్పారు.

విద్యార్థి ఫెడరేషను తరఫున గుర్రం వెంకటరెడ్డి (జిల్లావిద్యార్థిసంఘ ఆర్గనైజరు) మాట్లాడారు. దేశంలో సీట్లులేక విద్యార్థులు ఎలాబాధపడుచున్నారో వివరించారు. విద్యార్థి సంఘాలు సాధించిన విజయాలను విపులీకరిస్తూ ఈ ప్రాంతంలో కూడ బలమైన సంఘాలద్వారా విద్యార్థులు, టీచర్ల అవసరాలు తీర్చుకొనవచ్చునన్నారు. కొన్ని సంవత్సరాలనుండి స్వయంపోషకంగా వుంటున్న మునిసిపాలిటీ ఇపుడు క్రొత్తగా 9 వ నెల జీతం విధించడం అన్యాయమన్నారు. ఇది రద్దుచేయకపోతే మునిసిపాలిటీ దెబ్బతింటుందని హెచ్చరించారు. మూడు మాసాలనుండి మునిసిపల్ హైస్కూలు టీచర్లకు జీతాలుఇవ్వనందుకు మునిసిపాలిటీని ఖండిస్తూ వెంటనే వారికి జీతాలివ్వాలన్నారు.

పట్టణ సంయుక్త యువజనసంఘం తరఫున పి. హనుమంతరావుగారు, తర్వాత అధ్యక్షులు ఈవిషయమై విశదంగా మాట్లాడారు.

క్రింది తీర్మానాలు సభలో ఏకగ్రీవంగా ఆమోదింపబడినవి.

1. క్రొత్తగా అమలు జరుపుటకుగాను కౌన్సిలు తీర్మానించిన 9 వ నెల జీతాన్ని జిల్లాకలెక్టరుగారు వెంటనే ఆపుచేయించాలి.

2. మునిసిపల్ హైస్కూలులో అవసరమైన మరమ్మతులను వెంటనే ప్రారంభించాలి. 3 నెలలనుండి టీచర్లకు జీతాలివ్వనందుకు మునిసిపాలిటీ చర్యను ఖండిస్తున్నారు. వెంటనే టీచర్లకు జీతాలివ్వాలి.

3. 9 వ నెలజీతం రద్దు చేయించు విషయమై ఈక్రిందివారిని కలెక్టరు, డి. ఇ. ఓ. గార్లవద్దకు డెప్యుటేషను పంపుటకు వివిధ సంస్థల తరఫున ఒకకమిటీగా నియమించారు.

(i) పురజనుల తరఫున కె. రామచంద్రరావుగారు బి. ఏ. బి ఎల్. వకీలు.

(ii) పాతవిద్యార్థుల తరఫున యస్. నాగప్ప, ఎం. ఎల్. ఏ. (కాంగ్రెసు)కర్నూలు

(iii) పట్టణ సంయుక్త యువజనసంఘం తరఫున పి. రహిమాన్‌ఖాన్.

(iv) జిల్లా విద్యార్థి ఫెడరేషన్ తరఫున గుర్రం వెంకటరెడ్డి (జిల్లా విద్యార్థిఫెడరేషన్ ఆర్గనైజరు)

4. మద్రాసు రాష్ట్రంలో, ముఖ్యంగా కర్నూలుజిల్లాలో, కనీసం వచ్చే సంవత్సరం నుండయినా సీట్లసంఖ్యను హెచ్చించాలని విద్యాశాఖాధికారులను కోరడమైనది.

"ప్రజాశక్తి" కి విరాళాలు

పెదపాడు (పశ్చిమ గోదావరిజిల్లా) కమ్యూనిష్టుపార్టీ జనరల్‌బాడీసమావేశం పార్టీ ఆఫీసులో జరిగినది. సభ్యులు - సానుభూతిపరులు 20మంది హాజరైనారు. సమావేశంలో కార్యదర్శి జాతీయ పరిస్థితులను వివరించారు. "ఆంధ్రదేశంలో బ్రహ్మాండమైన ప్రజాఉద్యమాలు నిర్మించుచున్నాము. కనుక వాటిని ప్రతిబింబింపచేయాలంటే మనకు "ప్రజాశక్తి" దినపత్రిక యెంతో అవుసరం. కనుక మీరు దానికోరకు త్యాగాలు చెయ్యాలని" వివరించారు.

పెదపాడు పార్టీ సభ్యులు చాలాబీదకుటుంబాలనుండి వచ్చారు. అయినా ఉత్సాహంతో ముందుకువచ్చి విరాళాలు యిచ్చారు. ఒక సానుభూతిపరుడు రు. 500 లు వాగ్దానం చేసినాడు. పార్టీసభ్యుడు మూల్పూరి పుల్లయ్య రు. 116 లు వాగ్దానం చేశాడు. కట్నేని రామబ్రహ్మం రు. 116లు, మూల్పూరి కృష్ణమూర్తి రు. 150 లు, గారపాటి కాశన్న రు. 50 లు మూల్పూరి లక్ష్మీనారాయణ రు. 25 లు, గారపాటి బ్రదర్సు రు. 25 లు ఒక సానుభూతిపరుడు రు 20 లు-వాగ్దానం చేశారు. వ్యవసాయ కూలీ యువకులు కూలి పనిచేసి రు. 20 లు యిస్తామన్నారు. గునపర్తి లక్ష్మయ్య తన రెక్కలమీద ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న బీదవ్యక్తి. ఆయన రు. 10 లు వాగ్దానం చేశాడు. సామర్తి సుబ్బారావుకి ఆస్తి ఏమీలేదు. చిన్న కాఫీహోటలు ఆధారం. అయినా రు 10 లు వాగ్దానం చేసినాడు. ఎ. రెడ్డియ్య అనే కామ్రేడ్ కుటుంబం అంతా సానుభూతిపరులు. అందులో పార్టీ సభ్యులు యిద్దరున్నారు. కుటుంబం చాలా పెద్దది. అయినా రు 10 లు వాగ్దానం చేశాడు. వెంకటేశ్వర్రావనే సానుభూతిపరుడు రు 10లు వాగ్దానంచేశాడు. రెక్కలకష్టంమీదమీద ఆధారపడే కూలీలు 2, 3 రూపాయలు వాగ్దానాలు చేశారు. మొత్తం ఆసమావేశంలో రు. 1072-8-0 లు వాగ్దానాలు వచ్చాయి; సభ్యులంతా చాలా పుత్సాహపడ్డారు తరువాత క్రింది తీర్మానాలు అంగీకరించబడినాయి.

1. కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణకు జబ్బుగా వున్నందున వారిని వెంటనే విడుదల చేయాలి.

2. "ప్రజాశక్తి" పత్రికను దినపత్రిక చేయుటకు పర్మిషన్ యివ్వాలని కోరుతున్నాం.

3. యు. పి. ప్రభుత్వం "పీపుల్సువార్" లోకయుద్ధ, కామీజంగ్, పత్రికలపై విధించిన నిషేధాజ్ఞను ఖండించుతూ అట్టిఆంక్షను ప్రభుత్వం తీసివేయాలని కోరుతున్నాం.

"వెంగమ్మ" నాటకప్రదర్శనం కూడదు!

•

కాంగ్రెసువాది హెచ్చరిక

కస్తూరిబా నాట్యమండలివారు ఆగష్టు 5 వ తేదిని, మోరిగ్రామంలో "కామ్రేడు వెంగమ్మ" అను నాటకమును ప్రదర్శింతురని జూలై 16 వ తేది "ఆంధ్రప్రభ"లో చదివినాను. "వెంగమ్మ" నాటకమును నేను పూర్తిగా చదివియున్నాను. ఈ నాటక ప్రదర్శనమువలన అనేక జిల్లాలలో కొట్లాటలు జరిగినవి. తూర్పుగోదావరి జిల్లాలో ఎట్టి కలతలులేకుండా, అన్ని రాజకీయపక్షములవారు సోదర భావముతో పనిచేయుచున్నారు. ఈసందర్భములో "వెంగమ్మ" నాటకమును మోరిగ్రామములో ప్రదర్శించి జిల్లాలో అశాంతి, కల్లోలము కలుగజేయుట ధర్మముకాదు. నేను కమ్యూనిస్టునుగాను. గత పాతిక సంవత్సరములనుండి కాంగ్రెసులోఉండి ఉడుతాభక్తితో పనిచేయుచున్నాను. కమ్యూనిస్టు సిద్ధాంతములను ఖండించుటకు మనకు హక్కుకలదు. కాని వ్యక్తిదూషణకు దిగుట ధర్మముకాదు. ఈవిషయమై జిల్లాపెద్దలు ఆలోచించి, జిల్లాలో కొట్లాటలు ప్రారంభము కాకుండా చూడమని ప్రార్థించుచున్నాను.

(సం) పాలకోడేటి సూర్యప్రకాశరావు

రాష్ట్ర చెరుకు, బెల్లం ఉత్పత్తిదార్ల సమావేశం

ఆగష్టు 2 వ వారం సామర్లకోటలో

గత 5 సంవత్సరాలలో చెరుకు, బెల్లం ఉత్పత్తి విషయాలలోనూ, ఎగుమతుల విషయంలోనూ, ధరల విషయంలోనూ అనేకమైనకంట్రోలుఆర్డర్లనుప్రభుత్వంజారీచేసింది. ఈ ఆర్డర్లవెనుకవున్నఉద్దేశాలుమంచివేయైనా, రైతుల ప్రయోజనాలను సరిగా గుర్తించకనూ, రైతు ప్రతినిధులతో సంప్రదించకనూ ఈ ఆర్డర్లు జారీచేయబడుటచే ఉత్పత్తిదార్లకు అనేక కష్టనష్టాలు సంభవించాయి. తుమ్మపాలెం, కిర్లంపూడి మొదలైన ఫ్యాక్టరీల ఏరియాలలోని వేలకొలది టన్నులచెరకు పాడైపోవటం, బెల్లంధరలు విపరీతంగా పడిపోవటం – ఇందుకు నిదర్శనం. కాబట్టి ఈ కంట్రోలు ఆర్డర్లలోని లోపాలను తొలగించి, ఉత్పత్తిదార్లను రక్షించుటకై గత 2 సం॥ లోనూ విశాఖ, తూ గో. జిల్లాలలో చెరుకు, బెల్లం ఉత్పత్తిదారుల జిల్లా సమావేశాలు జరుపబడ్డాయి. వీటిద్వారాజరిగిన ఆందోళన ఫలితంగానే చెరుకు, బెల్లం ధరలు కొద్దిగా పెంచబడటం, కమాండీరు గావించబడ్డ చెరకును బెల్లంగాఆడుకొనుటకై విడుదల గావించటం, బెల్లంపైవుండే ఎగుమతి డ్యూటీని రద్దు గావించటము మొదలైన ప్రయోజనాలు సిద్ధించినవి. అయినా యింకాపూర్తిగా రైతాంగము యొక్క కోర్కెలు గుర్తించబడలేదు వాటికై ఇంకనూ ఆందోళన గావించవలసి యున్నది.

విరుదు రైతుసంఘాలు గావించిన సూచనపై ప్రభుత్వం తుమ్మపాల ఫాక్టరీ ఏర్యాలో రైతుప్రతినిధులు, మిల్లుప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులుగల ఒక కమిటీని నియమించింది. ఆకమిటీ కార్యకలాపమును గమనించిన పిమ్మట ఇతర మిల్లు ఏర్యాలలోగూడా కమిటీల నేర్పరుపుటకై అంగీకరించింది. అట్టి కమిటీలు వెంటనే ఏర్పాటు గావింపబడుటకుకూడా ఆందోళనచేయాలి.

కాబట్టి పై సమస్యలను చర్చించి, కార్యక్రమం వేసుకొనుటకు, రాష్ట్ర చెరుకు—బెల్లం వుత్పత్తిదార్లసమావేశమును ఏర్పాటు చేస్తున్నాము. ఈసమావేశము చెరుకు, బెల్లం ఉత్పత్తికి కేంద్రస్థానంగావున్న సామర్లకోటలో ఆగష్టు2 వ వారంలోజరుపుటకునిశ్చయించాం. అన్నిజిల్లాలనుండి ప్రతినిధులు అధిక సంఖ్యాకులుగా వచ్చి యీ సమావేశమునకు జయప్రదం గావించవలెనని కోరుచున్నాను. వివరములు త్వరలో ప్రకటించగలము.

నందూరి ప్రసాదరావు,
ప్రధానకార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం

విశాఖజిల్లా కరువుబాధితులకు రు. 1000 విలువగల వస్త్రాలు

★

విశాఖపట్నంజిల్లా పీపుల్సు రిలీఫ్‌కమిటీ (విజయనగరం)కార్యదర్శి కె. గోవిందరావు గారిలా రాస్తున్నారు:

"ఉత్తరవిశాఖ జిల్లాలో కరువు బాధితులైన స్త్రీలకు సహాయం చేసే నిమిత్తం ఆవంకసకం జిల్లా కరువునివారణ కమిటీ కార్యదర్శిగారు పంపిన రు. 1000 విలువగల చీరెలుఅందినవి. వారికికృతజ్ఞతాభివందనాలు."

సోంపేట తాలూకాలో

ప్రొక్యూర్‌మెంటు అక్రమాలు

సోంపేట తాలూకా రైతుసంఘ ప్రధానకులలో ఒకరైన గానుగుల తరుణాచారి గారిలా వ్రాస్తున్నారు :

జులై నెల 10వ తేదీ నుంచి నేనూ, మార్పు పట్నాభంగారూ, మందసా మొదలైన గ్రామాలలో సంచారం చేయుచు 14-7-45వ తేదీని మందసా గ్రామం వెళ్ళితిమి అక్కడి రైతులు బోరుమని ఏడ్చుచు మాకు కొన్ని అక్రమాలను గురించి తెలియచేశారు. 13వ తేదీని ప్రొక్యూర్‌మెంటు ఇన్‌స్పెక్టరు, కొంతమంది బంట్రోతులతోను గ్రామాధికారులతోను రైతుల యిండ్లవద్దకు వచ్చి, ధాన్యపుకొట్లకు సీళ్ళు వేశారు. మరునాడు తిరిగివచ్చి, సీళ్లతీసివేసి, కొట్లలోఉన్న ధాన్యం తూనికవేసుకొని తమతో తీసుకువెళ్లారు. రైతులు "అయ్యా, ఈ సంవత్సరం 4, 6 అణాల పంట కంటె యెక్కువ పండలేదు. ఉభాలకు వగైరా ఖర్చులకు యీధాన్యం అవసరము; యివన్నీ తీసుకొనిపోవుట ధర్మంకాదు," అని ఎంత మొరపెట్టుకున్నా, వినలేదు. "మాకు రేషన్ కార్డులు వహితం యిచ్చిఉన్నా"రని చూపించినప్పటికీ, న్యాయం కలుగలేదు.

ప్రభుత్వాన్ని నేను కోరేదేమంటే : జిల్లా కలెక్టరు ప్రకటించిన ప్రకారం, ఉన్నరైతుల వద్దనే ధాన్యం వసూలు చేయుట ధర్మం. కాని, 1, 2, 3 యకరాల భూమి గలవారి వద్ద వసూలు చేయుట ప్రభుత్వ నిబంధనలకే వ్యతిరేకం. ప్రొక్యూర్‌మెంటుపాలసీకివిరుద్ధం. కాబట్టి సాగుఅయే భూమి విస్తీర్ణం తెలుసుకొని, ఎంతెంత పండినదీ ఎస్టిమేటుచేసి, నిబంధనలలో సూచించిన ప్రకారం వసూలు చేయవలసినదిగా స్థానికాధికారులకు ఉత్తరువులు పంపాలి. దానున్న ఉభాలు వగైరా ఖర్చులకు మిగల్చకుండా తీసుకున్న ధాన్యం వెంటనే యిప్పించవలసియుంది.

★

అధికాహారోత్పత్తికి సూచనలు

కర్నూలుజిల్లాలో పాణ్యం రైతుసంఘ ఆర్గనైజరు ఎస్. గఫూర్ గారిలా వ్రాస్తున్నారు:

పాణ్యం చెరువుకింద 400 యకరాల మాగాణిభూమి ఉంది. కాని, చెరువు లోతు తక్కువ; నీరు కొద్దిగానే నిలుస్తుంది. అదృష్టవశాత్తు వర్షం బాగా కురిస్తే, ఆనీరంతా వాగులోకి పోతుంది. ఫలితం, పంటలు సరిగా పండక, ప్రజలు కరువుకు గురవుతున్నారు. చెరువుకు మధ్యగా 10 గజాలపొడవు, అరగజం ఎత్తు, గల కట్ట ఒకటి ఉంది. కాలువనిండా నీరువస్తే, 1½ గజములనుండి 2 గజముల వరకు చెరువులోకి నీరు వస్తుంది. కాని అందులో 1½ గజాల నీరువృధాగా, కట్టగుండా వాగులోనికి పోవుచున్నది. ఇలా నీరు వృధా కాకుండా చెయ్యాలంటే, కట్టను ఎత్తు చేయించి, నీరు సరాసరి చెరువులోకి వచ్చేలా చూడాలి. చెరువును లోతుగా తవ్వించాలి. కట్టపై మన్ను చెరువులో పడకుండా రాతితో కట్టించాలి. నీరువచ్చే కాలువను ఎత్తు చేయించాలి. త్వరలో ప్రభుత్వాధికారులు యీ మరమ్మతులు చేయించకపోతే, మాగాణిభూములు దెబ్బతింటాయి.

★

వ్యవసాయ పనిముట్లకు కొరత

పాణ్యం ఫిర్కాలో రైతులకు బండి పట్టాలు, పారలు, యితర వ్యవసాయ పనిముట్లుదొరక్క చాలయిబ్బంది పడుతున్నారు. తాలూకా దిమాన్‌స్ట్రేటరుగారు ఫిర్కాకు కావలసిన పనిముట్లు తెప్పించి, దరఖాస్తులు పెట్టుకున్నవారి పరిస్థితు లాలోచించి, న్యాయంగా సప్లయి చేయవలసిందని కోరుతూ ఎస్. గఫూర్‌గారు ప్రకటన చేస్తున్నారు.

సీటీఆక్టు దుర్వినియోగం

తిరువూరు తాలూకాలో చాలామంది లంబాడీలున్నారు. వారు కొన్ని తండాలుగా స్థిరనివాసం ఏర్పరచుకొని, వ్యవసాయ వృత్తివల్ల పొట్టపోసుకొంటున్నారు. కాని, పోలీసు అధికారులు నేరాలుచేసినవారు-చేయనివారు అనే విచక్షణ లేకుండా వారిమీద ఆక్టును అమలు పరుస్తున్నారు. అర్ధరాత్రులలో వారు ఎంత చీకటిలో ఐనా, ఎంతవర్షం కురుస్తున్నా-లెక్కచేయక భార్యాపిల్లలను, అస్థలనువదలి పోలీసు స్టేషనుకుగాని, మునసబులవద్దకుగాని హాజరు కావలసివస్తోంది దీని మూలాన అనేక బాధలు, వ్యవసాయం నష్టపడుటజరుగుతోంది. కాబట్టి, విచక్షణ లేకుండా సీటీ ఆక్టును యిలా అమలుజరిపే విధానాన్ని రద్దుచేయవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ 18—7—45న కూనవరాజువర్వ గ్రామంలో రైతుసంఘ యాజమాన్యాన 1000 మందితో జరిగిన బహిరంగసభలో ఏకగ్రీవంగా తీర్మానింపబడింది.

★ టెంపరరీ పనివారిని పర్మనెంటు చేయాలి ★

యం. యస్. యం. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి బ్రాంచి ఉనికి నిజంగా సార్థకమైనది. ఒక్క 1945 లోనే ఎన్ని విజయాలు సాధించిందో చూడండి. దీని ప్రచారం మూలంగా లోకోషెడ్డులో దొంగతనాలు తగ్గిపోయాయి; ఇంజనుక్లీనర్లను, మెడికల్ డిపార్టుమెంటులో స్వీపర్లను హెచ్చుచేశారు; గోదావరి బ్రిడ్జికార్మికుల జీతాలు రు. 12 లకు హెచ్చుచేయబడింది. రైల్వే సబ్‌ఇన్‌స్పెక్టరు అక్రమంగా బనాయించిన కేసులను పోలీసులు ఉపసంహరించుకొనేలా చేశారు. అన్నిటికన్నా ఎన్నదగిన విషయం - తమ సంఘ ఆర్గనైజరు కామ్రేడ్ శర్మను జైలుకటకటాలనుండి విడిపించుకు రాగలిగారు.

మహిళల విషయంలో రైల్వేకాలనీలో మహిళాసంఘం ఏర్పడడానికి యూనియన్ తోడ్పడింది. హాస్పటల్‌లో నర్సుకావాలని, గ్రెయిన్‌షాపులో మహిళలకు ప్రత్యేకంగా ఒక కౌంటరు కావాలని వారు జరిపిన ఆందోళనలో తోడ్పడి, జయం పొందేలా చేసింది. ఇలా అన్నివిధాల తమ అభివృద్ధికోసం పాటుపడుతూన్న తమ సంఘాన్ని, ఎంత త్యాగానికయినా వెనుదీయక బలపరచుకోవాలనే దీక్ష రాజమండ్రి రైల్వే కార్మికుల్లో నానాటికి దృఢపడింది. తమ బ్రాంచియొక్క 8వ మహాసభ జరుగుతూందంటే వారుకనబరచిన ఉత్సాహం వేరే చెప్పనక్కరలేదు. రు. 160లు విరాళాలు వసూలయాయి.

మహాసభ జూలై 21, 22వ తేదీల్లో జరిగింది. 40 మంది ప్రతినిధులు సభకు వచ్చారు. తమ యిబ్బందులకు సంబంధించిన తీర్మానాలపైని, కార్యదర్శి నివేదికపైని ప్రతినిధుల సమావేశంలో ఎంతో ఉత్సాహంతో చర్చలు జరిగాయి. కామ్రేడ్ బాలాజీదాసు జండా ప్రతిష్ఠాపనచేశారు. 22వతేదీ సాయంత్రం ఎస్. ఐ. రైల్వే లేబరుయూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ కళ్యాణసుందరం అధ్యక్షతను మహాసభ ప్రారంభమైంది. కామ్రేడ్ సి. వి. కె. రావు ప్రారంభోత్సవంచేశారు. వేయిమందికిపైగా సభకువచ్చారు. వీరిలో సుమారు 300 మంది కార్మిక స్త్రీలు.

ఈనాడు కాశేశ్వరరావువంటి కొందరు నాయకులు రోడ్లు, రైల్వేలు కూడదంటూ, పరిశ్రమలు పనికిరావంటూ చేస్తూన్న 'ప్రచారంయొక్క తెలివితక్కువతనాన్ని రావుగారు స్పష్టపరిచారు. సిమ్లా సమావేశంయొక్క ఫలితాలను, తిరిగి నాయకులు కలుసుకోవలసిన అవసరాన్ని విశదంచేశారు.

తరువాత అధ్యక్షులు మాట్లాడుతూ యిలా అన్నారు : "ఎం. ఎస్. ఎం. రైల్వే కార్మిక సంఘంలో 60 వేలమంది, ఎస్. ఐ. రైల్వే కార్మికసంఘంలో 42 వేలమంది కార్మికులు సంఘటితమై ఉన్నారు. ఈ సంఘటిత శక్తి ఎంత మహత్తరమైనదో - దేశమంతా యిలా సంఘటితమైతే స్వాతంత్ర్యాన్ని ఎంతత్వరగా సాధించవచ్చో గుర్తించాలి.

"ఈనాడు అంతా విజయోత్సవాలుచేసుకుంటుంటే రైల్వే కార్మికుల్లో ఒక లక్షకుపైగా దిగులుతోవున్నారు. ఇందుకు కారణం వారు టెంపరరీ పనివారు కావడం, ఇక ఏక్షణంలో తీసేస్తారో అనేభయం. వీరిని తీసేస్తే ఇప్పటికే అధ్వాన్నస్థితిలోఉన్న ప్రయాణ సౌకర్యాలు ఎలా మరీ దుర్భరస్థితికి వస్తాయో ప్రజలకు వివరించాలి. వారి సహకారంతో ఈ టెంపరరీవారిని పర్మనెంటు చేయడానికి కృషిచేయాలి" అని ఉద్బోధించారు.

మహాసభ సందర్భములో "కష్టజీవి" బుర్రకథ, "వర్కుత్త్రానం" నాటకం ప్రదర్శింపబడ్డాయి.

వచ్చే సంవత్సరానికి కె. నమ్మయ్యగారు అధ్యక్షులు; ఎ. శ్రీనివాసరావుగారు కార్యదర్శి; సత్యనారాయణ, పి. సింహాచలం సహాయకార్యదర్శులు; డి. కన్నయ్య కోశాధికారులుగ ఎన్నుకోబడ్డారు.

బెజవాడ

మునిసిపల్ కార్మికుల కోర్కెలు

కర్నూలుపట్టణ మునిసిపల్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి ఈదిగువ ప్రకటన చేశారు :

కర్నూలు మునిసిపల్ వర్కర్సు యూనియన్ ఈ క్రింది కోర్కెలతో 14-6-45న మునిసిపల్ కమీషనరువద్దకు డెప్యుటేషన్ వెళ్ళింది.

(1) జి. ఓ. నెం. 517 రు (27-4-45) తేదీలలో నిర్ణయింపబడిన రూ 16-0-0 ల కరువుభత్యం 1945 జనవరినుండి యివ్వవలసినదిగా ప్రభుత్వం సూచించినప్పటికీ, మేనెలకు మాత్రం కర్నూలు మునిసిపాలిటీ పైరేటు ప్రకారం ఇచ్చింది. మిగతా నాలుగు నెలలకు (జనవరి-ఏప్రియల్) వెంటనేమొత్తంగా యివ్వాలి.

2. జి. ఓ. నెం. 1948 రు (17-7-41) లో ప్రకటింపబడిన సెలవులు మునిసిపల్ పనివారలకందరికి అనువర్తింప చేయవలెను.

3. ప్రస్తుతం మునిసిపల్ పనివారలకు రూ. 8/- నుండి రూ. 14/- వరకు జీతాలు ఇవ్వబడుచున్నవి. అందరి పనివారలకు కనీస జీతం రూ. 12-0-0 వుండాలి.

4. ప్రతి నెల 10-15 తేదీల మధ్య జీతాలు ఇవ్వబడుచున్నవి. అటులకాక పక్రమంగా జీతాలు 1, 2 తేదీలలో ఇవ్వాలి.

ఇప్పటికి మొదటికోర్కె మాత్రమే డెప్యుటేషన్ ఫలితంగా తీర్చబడ్డది. కాని మిగతా కోర్కెల విషయమై యింతవరకు మునిసిపాలిటీ చర్య తీసుకొనలేదు. పై కనీసపు కోర్కెలు నెరవేర్చబడక మునుపే మరొక క్రొత్త సమస్య వచ్చిపడింది.

1945 ఆగష్టు 1వ తేదీ నుండి 15 మంది పనినుండి తొలగింప బడుదురని హెచ్చరిక చేస్తూ తాకీదులు జారీ చేయబడినవి. దీనికి కారణం వారందరు 60 సం॥ పైబడినవారని, ముసలితనంవల్ల సక్రమంగా పని చేయుటలేదని పాకులుచెప్పుచున్నారు. వారిలో సగంమంది ఇంకా సక్రమంగా పనిచేయగల శక్తిసామర్థ్యములు కలిగియున్నారు. అలా శక్తిగలిగి పనిచేయుటకు ఇష్టపడు వారిని ఈకష్ట దినాల్లో పనినుండి తొలగింపరాదు ఘోరం. వారికి ఇంకా 2, 3 సం॥లు మినహాయింపు ఇచ్చి పనిలో ఉంచవలెను. ఈమునిసిపాలిటీలో ప్రావిడెంటుఫండు ఇంతవరకు అమలు జరుపలేదు. కావున మిగతా తొలగింపబడిన వారికి ఉద్యోగానంతరము ఆధారము ఉండదు. కావున వారికి గ్రాట్యుటీ యివ్వవలెను.

ప్రజాశక్తి

జపానుకు తుది హెచ్చరిక

తాపీ మోహన్‌రావు

బేషరతుగా లొంగిపోయి, జపాన్నంతా మిత్రరాజ్యాలకు వప్పగించడమనే దుర్గతిని తప్పించుకొని, రాయబారాలద్వారా ఆ ప్రభుత్వాలతో సంధి కుదుర్చుకొని, బయటపడాలని జపాను ఫాసిస్టుల ఆశ. యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగిస్తే ఈ ఆశ నెరవేరే అవకాశాలు ఇంకా ఎక్కువగా ఉంటాయని వీరి అంచనా. అందువల్ల చైనారంగంలో మంచూరియా మొదలైన కీలక స్థానాలను బాగా బలపరచుకొని, అక్కడనుంచి మిత్రసేనలను ప్రతిఘటించాలని వారి ఎత్తుగడ.

కాని పసిఫిక్కు యుద్ధగమనం వీరనుకున్న దానికన్నా ఎక్కువ వడిగా సాగనారంభించింది. జపాను చేరువలో అనేక కీలకస్థానాలు అమెరికావారి వశమయాయి. జపాను నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలను అరికట్టివేసింది, అమెరికా నౌకాబలం. టోకియో, యోకహామాలాంటి ఆయువుపట్టులన్నీ అమెరికా విమానాలవాతబడిశిధిలమయిపోయాయి. ఇప్పుడు అమెరికా, బ్రిటిష్, నౌకాదళాలుకూడా జపాను పడిగడ్డమీదనే సరాసరి ఫిరంగి దాడులు ప్రారంభించాయి. ఇటు మలయాపైని బ్రిటిష్ సేనలు స్థావరమేర్పరచుకున్నాయి. త్వరలో సింగపూరు కూడా జపాను వారిచేతుల్లోంచి జారిపోతుంది. మిలిటరీ రంగంలోకుదుస్తూన్న ఈపరాజయ పరంపరలకు తోడు రాజకీయంగా కూడా పరిస్థితులు జపాను ఫాసిస్టులకు దుర్భరమవుతున్నాయి. యూరపుయుద్ధం సమాప్తమయిన నాటినుంచి, ఇక త్వరలోనే సోవియట్ పసిఫిక్కు రంగంలో కూడా కలుగజేసుకుంటుదనే నమ్మకం నానాటికి బలపడుతూంది. చైనా ప్రధానమంత్రి స్టాలిన్‌తో జరిపిన దీర్ఘసమాలోచనలతో ఈభావం మరింతదృఢపడింది. పరిస్థితులింకా తీవ్రం కాకమునుపే రాజీకుదుర్చుకోవాలనే తహతహ జపాను ఫాసిస్టుల్లో కలిగింది.

'సంధి రాయబారాలకు సిద్ధం'

"బేషరతుగా లొంగిపోవాలనే షరతును ట్రూమన్ మార్చుకుంటాడు. రూజవెల్టు చనిపోయిన తరువాత, జర్మనీ పతనమయిన తరువాత మిత్రరాజ్యా లింకా పరస్పరం అంటిపెట్టుకొని, ఉండవలసిన అవసరం ఏముంది? పసిఫిక్కు బాధ్యత తనపైని పడకుండా తప్పించుకోవాలని సోవియట్ అప్పుడే ప్రయత్నిస్తూంది. ఏదో నామమాత్రంగా పాల్గొని తప్పించుకుందామని బ్రిటన్ ఉద్దేశం" అంటూ జపాన్ ప్రచారకులు నాంది పలికారు. సోవియట్ జోక్యం కలిగించుకోదు, బ్రిటన్ని నమ్ముకోడానికి వీల్లేదు - కాబట్టి ఓ అమెరికా వారా, ఎందుకింకాయుద్ధం, రాజీచేసుకుందాం, రాండి అని ఈ ప్రచార భావం.

ఇది జరిగిన కొద్దిరోజులకే జపాన్‌వారు అసలుసంగతి బయటపెట్టారు. "బేషరతుగా లొంగిపోవాలనే షరతులను మార్చుకొని, అట్లాంటిక్ ప్రణాళికలోని సూత్రాలు మాకు కూడా వర్తిస్తాయని అమెరికా హామీఇస్తే రాయబారాలు జరిపి, సంధి కుదుర్చుకోడానికి జపాను సిద్ధంగాఉంది" అని టోకియో రేడియో ఒక ప్రకటన చేసింది.

కాని, జపాను ఫాసిస్టులు గుడ్డిభ్రమ కొద్ది ఒకముఖ్యవిషయాన్ని గుర్తించలేకపోయారు. లోకంలో ఫాసిస్టు పురుగయినా మిగలకుండా చేయాలని దీక్షబూనిన శక్తులదే పైచేయి అవుతున్నదనీ, ఫాసిస్టు అనుకూలురు నామరూపాలు లేకుండా పోతున్నారనీ, వీరు గుర్తించలేదు. తమ ప్రకటన పనిచేయగల వాతావరణం ఏనాడో తొలగిపోయిందని గుర్తించలేదు.

పిడుగు

ఈ ప్రకటన వెలువడిన మరునాడే అమెరికా, బ్రిటన్, చైనాల తుదిహెచ్చరిక వెలువడింది. బేషరతుగా లొంగిపోవడమో, లేక పూర్తిగా విధ్వంసం కావడమో - ఈరెండే జపానుకున్న మార్గాలని ఈ ప్రకటన స్పష్టపరచింది. ఇది జపాను ఫాసిస్టుల పాలిట ఒక పిడుగు. దేశం నాశనమయిపోతున్నా, ప్రజలు నానాబాధలు పడుతున్నా, తమ ప్రాణాలను దక్కించుకోవడం కోసం ఫాసిస్టులు చివరవరకూ ఎలాపోరాడుతారో జర్మనీ రుజువుచేసింది. జపాను ఫాసిస్టులు జర్మన్ నాజీల శిష్యులే. బ్రిటన్, అమెరికా, చైనాల తుదిహెచ్చరికను జపాను ప్రభుత్వం తృణీకరించింది. తుదివరకు పోరాడ నిశ్చయించింది. ఫాసిజ విధ్వంసనానికి జర్మనీలో జరిగిన కర్మకాండ జపానులో కూడ జరుగక తప్పదు.

గమనించతగ్గ విషయం

ప్రపంచంలో శాంతిమయ, సౌఖ్యప్రద నూతన వ్యవస్థను స్థాపించడానికి తగినకార్యక్రమంకోసం ట్రూమన్, చర్చిల్, స్టాలిన్లు సమావేశమయింది పోట్సుడమ్‌లో. అక్కడనుండే బ్రిటన్, అమెరికా, చైనా లిచ్చినపై అంతిమ సందేశం వెలువడడం గమనించవలసిన విషయం. ఇంతవరకు పసిఫిక్కు రంగంలో సోవియట్ జోక్యం కలిగించుకొనకపోయినా, ఆవిషయాలను గురించి మునుపటికన్నా ఎక్కువశ్రద్ధ చూపుతూండడం నిర్వివాదాంశం. పోట్సుడమ్ సమావేశము పూర్తికాగానే స్టాలిన్ చైనాప్రధానితో తిరిగి సమాలోచనలు ప్రారంభిస్తారని తెలుస్తూంది. వీటన్నిటిని బట్టిచూస్తే చాల త్వరలోనే పసిఫిక్కు రంగంలో తన పాత్రను సోవియట్ వెల్లడి చేయవచ్చు.

ఈనాడు పసిఫిక్కురంగంలో జపాను తరువాత జపానంతదానిగ మంచూరియాను బలపర్చుకుంటున్నారు జపానీయులు. మంచూరియాలోని వారి బలాన్ని నాశనంచేస్తేగాని జపానుని సంపూర్ణంగా ఓడించడం జరగదని అందరూ గుర్తించారు. ఈ కార్యం సోవియట్ సహకారంతోనే త్వరలో సాధ్యంకాగలదు. సోవియట్ జోక్యం కలిగించుకొంటేనే పసిఫిక్కులో ఫాసిజాన్ని పూర్తిగా నాశనంచేయడం జరుగుతుంది.

చైనాలో

ఫాసిజాన్ని సమూలంగా నాశనంచేయడం విషయంలో మిత్రరాజ్యాలవలంబిస్తున్న వైఖరిని పరిశీలిద్దాం - ఆశయసిద్ధికవి ఎంతవరకు తోడ్పడగలవో చూద్దాం. మిలిటరీ రీత్యా జపాన్ని ఓడించడానికి బ్రిటన్, అమెరికన్, చైనా ప్రభుత్వాలు అచంచలదీక్షతోఉన్నాయి. ఏకముఖంగా జపాన్నెదుర్కోడానికి వ్యూహం పన్నుతున్నాయి. కాని ఈ వ్యూహం వెనుకభాగాన చైనా, అమెరికా ప్రభుత్వాలు నెలకొల్పుతూన్న వాతావరణం ఎలాంటిది?

అమెరికా బలాల అండజూచుకొని కొమింటాంగు ప్రభుత్వం చైనాలో కమ్యూనిస్టు ప్రదేశాలపై అంతర్యుద్ధం ప్రారంభించడానికి సర్వ సన్నాహాలు చేస్తుందని లోగడవిన్నాం. నేడా అంతర్యుద్ధం ప్రారంభించింది. నాలుగు కమ్యూనిస్టు రాష్ట్రాలమీదికి ప్రభుత్వం తన సేనలను పంపింది. కొన్నిచోట్ల జపాను శ్రేణుల్ని ఎదిరించి నిలిచిన సేనల్ని కూడా ఇందుకు మరలించింది.

"కమ్యూనిస్టుల్ని హతమార్చడం ప్రథమ కర్తవ్యం - జపానువాళ్ళ నెదుర్కోవడం తరువాతపని" అని ఈ సేనల సమరనినాదం. ఇలా కొమింటాంగు ప్రభుత్వ దండయాత్రకు గురి అయిన నాలుగు రాష్ట్రాలలో షాన్‌టంగ్ రాష్ట్రం ఒకటి. ఈ రాష్ట్రాన్ని అటునుంచి జపాను సేనలు, ఇటునుంచి కొమింటాంగు సేనలు - రెండూ ఒకేసారి ముట్టడిస్తున్నాయి. పైపెచ్చు కొమింటాంగు అధికారులంటున్న దేమిటో చూడండి— "జపానువాళ్ళ సహకారంతో చైనా కమ్యూనిస్టులే ప్రభుత్వ సేనలపైనివిరుచుకుపడ్డాయి." మిత్రరాజ్యాలన్నీ కలిసి ఏకముఖంగా జపాన్నెదుర్కోవలసిన ముహూర్త మాసన్నమయినప్పుడే, కొమింటాంగు ప్రభుత్వం ఇలాంటి ఘాతుకానికి ఒడిగట్టింది. మొదటినుంచీ జపానువారితో లోపాయకారీగా వర్తకం మొదలయిన వ్యవహారాలు సాగిస్తున్న స్వార్థపరులు, అభివృద్ధినిరోధకశక్తులే యీ నాటకానికి సూత్రధారులు. ఏవిధంగా నయినా జపానుతో సంధి చేసుకుందామని లోలోపల ప్రచారంచేస్తూ, చైనా మనోబలాన్ని క్రుంగదీయ జూచిన ఫాసిస్టు అనుకూల శక్తులే ఈ ఘాతుకానికి ముఖ్యకారకులు. చైనాలో అమెరికా నారవలంబిస్తున్న విధానం ఈశక్తులనే బలపరుస్తూంది; ప్రజాస్వామ్య శక్తులపై దెబ్బతీస్తూంది. అమెరికా రాయబారి హర్లీ ఈ మధ్య వాషింగ్టన్ వెళ్ళివచ్చిన దగ్గరనుంచీ అమెరికావారు చైనాలో అచ్చంగా సామ్రాజ్యవాద విధానాన్ని నవలంబిస్తున్నారని చైనా కమ్యూనిస్టు నాయకులు స్పష్టంగా వెల్లడిచేశారు.

ఈవిధంగా ఒకవైపు జపాన్ని ఓడించడానికి కార్యక్రమంవేసుకుంటూ, మరోవైపు చైనాలో ఫాసిస్టు అనుకూల, సామ్రాజ్యవాద శక్తుల్ని బలపరుస్తున్నారు, అమెరికా పాలకవర్గమూ, చైనా కొమింటాంగు పార్టీవారూ, ఇది క్రైమియా నిర్ణయానికి, ప్రపంచప్రజల ఆశయానికి విరుద్ధము. ఈఆటలు సాగడం అసంభవము. అటు సోవియట్ యూనియన్, ఇటు ఈనాడు బ్రిటన్‌లో అధికారం చేబట్టిన లేబరుపార్టీ చైనాలోని ప్రజాశక్తులకు తోడు నిలచి ఈఆటలను తప్పక అరికట్టగలవు. మిలిటరీరీత్యా జపాన్ని పూర్తిగా ఓడించడమే కాకుండా, పసిఫిక్కులో కూడా ఫాసిజాన్ని నామరూపాలు లేకుండా సమాధి చేయడం జరిగి తీరుతుంది.

31—7—45

ఆగస్టు 7 వోటర్ల జాబితాకు ఆఖరు తేదీ

కేంద్రశాసన సభ ఎన్నికలలో వోటుచేయడానికి అర్హతగలవారి పేర్ల జాబితా ప్రకటింపబడింది. డిప్యూటీకలెక్టర్ల ఆఫీసుల్లోను మునిసిపాలిటీ ఆఫీసుల్లోను రిఫరెన్సుకు దాన్ని చూచుకోవచ్చు. ఈజాబితాలో చేర్చబడక మిగిలిపోయిన వోటర్లపేర్లు, ఫిర్యాదులు ఆగస్టు 7 (1945) లోగా రివెన్యూ డివిజనల్ ఆఫీసరు ద్వారాగాని, మునిసిపల్ కమీషనర్ల ద్వారా గాని తెలియపరచాలి. వివిధ ప్రజాసంస్థలలో పనిచేసే ప్రచారకులు యీ విషయంలో శ్రద్ధతీసుకొని పనిచేయవలసియుంది. రు. 50 భూమిపన్ను చెల్లించేవారు, రు. 20 వృత్తిపన్ను చెల్లించేవారు, వోటర్లుగా ఉండ వచ్చును.

అనంతపురం కాంగ్రెసు భవనాన్ని తిరిగి ఇచ్చివేయాలి

★

అనంతపురంలో కొత్తగాకట్టిన కాంగ్రెస్ భవనాన్ని దేశరక్షణచట్టం ప్రకారం ప్రభుత్వానికి స్వాధీనపరచమని క్రిందటినెల 22వ తేదీని రిక్విజిషన్ నోటీసు జారీచేయబడింది. మరునాడు కల్లూరి సుబ్బారావుగారు, ఇతర జిల్లా కాంగ్రెసు నాయకులు కలెక్టరువద్దకు వెళ్ళారు. కాంగ్రెసు భవనంలో ఒక పుస్తకాలయం, నూలు వడుకు కేంద్రము, పెట్టడలచితిమనీ, నోటీసును ఉపసంహరించుకోవలసిందనీ, వారుకోరారు. కలెక్టరు 'వనేమిరా' అన్నాడు. ఒక అరగంటలో స్వాధీనం చేయవలసిందని కాంగ్రెసు అసెంబ్లీ కార్యదర్శికి తెలియజేశారు. అలా అరగంటలో ఖాళీచేసి యివ్వడం సాధ్యంకానందున తాళం బద్దలుకొట్టి స్వాధీనం చేసుకున్నారు.

ఇందులో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తారట.

ఈ విషయమై అనంతపురంలో తీవ్రమైన అసంతృప్తి కలిగింది. బహిరంగసభలలో ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానాలు చేయబడుతున్నాయి. కల్లూరి సుబ్బారావుగారు మద్రాసు వెళ్ళి ప్రభుత్వ సభ్యులతో మాట్లాడినట్లూ, వారంరోజుల్లో ఉత్తరువులు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పినట్లు, తెలుస్తోంది.

అనంతపురం పౌరులలోను, కాంగ్రెసువాదులలోను, యిలా అసంతృప్తిని రేకెత్తించే చర్యకు జిల్లా కలెక్టరు దిగడం గర్హనీయం. పోలీసుస్టేషనుకు ఇల్లు కావలసివస్తే, మరొకచోట ప్రయత్నించరాదా? కొత్తగా కట్టిన కాంగ్రెసు భవనం మీదే వచ్చిపడాలా? వెంటనే మద్రాసు ప్రభుత్వం అనంతపూర్ జిల్లా కలెక్టరు ఆర్డరును రద్దు చేయవలసిందని హెచ్చరిస్తున్నాం.

ఆంధ్ర నాటకరంగానికి ఆభరణం "ముందడుగు"

"రైతులకు సంబంధించినంత వరకు ఇంతగా వ్రాసిన, ఇంత చక్కగా ప్రదర్శించిన, నాటకం నేను చూడలేదు. ఈరచయితలకు రూ.116 లను బహూకరిస్తున్నాను."

అని శ్రీ కాట్రగడ్డ రఘురామయ్యగారు "ముందడుగు" నాటకాన్ని మెచ్చుకుంటూ తమ బహుమతిని ప్రకటించారు. ఇంకోసారి ఈ నాటకాన్ని ప్రదర్శించవలసిందని కూడా కోరారు. ఇది మొదటిసారి బెజవాడ "హనుమంతరాయ గ్రంధాలయం"లో 23-7-46 న ప్రదర్శించిననాటి విషయం. వాల్గురోజులైనా మక్కుండానే, 28 వ తేదీన "ఆంధ్ర ప్రజా నాట్యమండలి" యొక్క కృష్ణాజిల్లా దళం వారు తిరిగి ఈ నాటకాన్ని అదే హాలులో ప్రదర్శించారు.

నాటక ప్రదర్శనానంతరం నూట పదహార్లురూపాయలు చదివించారు. ఒక "నాట్యకళాభిమాని". ఒకవిజామాంధ్రుడు తన ఉంగరం బహూకరించారు. పాటిబండ మాధవశర్మగారు "ఉషస్సు", "వీణ" మొదలగు పత్రికలను వడిపిన సాహితీ పిపాసి. ఆయన "అచ్చయ్య" పాత్రధారికి ఒక రజిత పాత్ర బహూకరించారు. దావరాల అచ్చయ్యగారు మరొక రజితపాత్ర బహూకరించారు. అంతేగాక తామొక ప్రదర్శనానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఒక మహిళ 5 రూపాయలు. మరొక ప్రేక్షకుడు ఒకరూపాయ. ప్రజా నాట్యమండలికి బహూకరించారు.

"ఇంత బాగుంటుందని అనుకోలేదు"

"అసలు నేను బాగానే వుంటుందని అనుకోలేదు"

— అని ఈ నాటకంపై చిన్నచూపు పెట్టుకువచ్చిన మేధావులిద్దరికి "ఆశాభంగం" కల్గింది.

"మొన్నటికంటె ఇవాళ మరీబాగుంది"

"తెనాలిలో ప్రదర్శించిననాటికీ ఈనాటికీ వహస్రాంశం తేడావుంది. ఎన్నోరెట్లు బాగు పడింది"

— అంటూ ప్రశంసిస్తూ ఇద్దరు సాధారణ ప్రేక్షకులు వెళ్ళిపోతున్నారు.

ఈవిధంగా మేధావుల, రైతుల, సాధారణ ప్రేక్షకుల ప్రశంసలకు గురియైన యీ నాటకంలోని, నాటక ప్రదర్శనంలోని విశేషం ఏమిటి?

నాటకంపేరు "ముందడుగు". ఇది ఒకజమీందారీ ప్రాంతంలో ఒక పల్లెటూరి జీవితాన్ని చూపుతుంది. జమీందారీ దుండగాలకు గురి అయ్యే ప్రజల జీవితాన్ని, జమీందారీ ఆశ్రితుల దుశ్చేష్టలను బహిరంగపరచుతుంది. జమీందారుతో వియ్యాలంది, పెద్ద గౌరవమేదో పొందాలనుకొని, చివరకు అతని దుండగాలను ఒక్కొక్కటీ ప్రత్యక్షంగా చూచి, మనసు మార్చుకున్న ఒక ధనికరైతు మనస్తత్వాన్ని చక్కగా చిత్రించుతుందీ నాటకం. జమీందారీ రైతుల్ని సంఘటితపరచి, జమీందారుని, తాసీదారుని, అతని తొత్తులను ఎదుర్కొని, అష్టకష్టాలకు గురియౌతున్న రైతు సేవకుని త్యాగదీక్షను ప్రదర్శించుతుంది. జమీందారీ పాశవికంకోసం పాకులాడే తండ్రిని ధిక్కరించి, బీదసాదలయెడ ఆదరాభిమానాలతో మెలిగే యువతి స్త్రీ స్వాతంత్ర్యేచ్ఛను వెలిబుచ్చుతుంది. చైతన్యవంతులయిన ప్రజలముందు జమీందారీ కుతంత్రాలు భస్మమౌతాయి. క్లుప్తంగా యీ నాటకంలోని ఇతివృత్తం ఇది.

★

"హృదయక్షేత్రాన్ని సాగుచేసేవారు కళావేత్త" అన్నాడు స్టాలిన్. ఈనాటక రచయితలకు ఇదెంతైనా వర్తిస్తుంది. రచయితలు (సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుగారలు) రైతుబిడ్డలు. రైతు సేవకులు. రైతుల నిత్యజీవితంతో సంపర్కముంది వీరికి. అందుచేతనే ఈనాటకంలోని పాత్రలు సజీవంగా ఉన్నాయి. వాస్తవికత పాత్రలో ఉట్టిపడుతోంది. పాత్రలు మాటాడే భాష ఎంతో సహజంగా, ఔచిత్యంతో కూడుకుని ఉంది. వ్యర్ధపదాలు, శబ్దాడంబరాలు, దమదమాలు లేకుండా తెలుగునుడికారం ప్రతిబింబించుతూ, తెలుగు సామెతలతో, నాటకం చదివేవారికి వినేవారికి-ఎంతో హాయి గొలుపుతుంది.

★

కరపత్రాలలో ప్రకటించిన టైముకుసరిగ్గా తెరలేచింది. ఈలలు, చప్పట్లు లేకుండానే, శాంతంగా సకాలంలో నాటకం మొదలెట్టారు. ఒక దృశ్యం తర్వాత మరోదృశ్యంలో లీనమై ప్రేక్షకులు నిశ్శబ్దంగా చూచున్నారు. కిరాయి నటకులు తమ నాటకాలలో ఒకరికంటెఒకరు కీర్తిప్రతిష్టలను తెచ్చుకోవాలనే తలపుతో ప్రక్కనటకులను దాదాపు ఖూనీ చేస్తారు. అలా గాకుండా, ఈనటకులు మంచి సమిష్టిభావంతో, నాటకం జయప్రదమవడానికికృషిచేశారు. నటకులంతా ప్రజా సేవకులు.

సమర్ధతతో నటించుటేగాక, తక్కిన వారినందరినీ నటింపజేసి, మంచి శిక్షణ ఇచ్చిన కోదూరు అచ్చయ్యగారు శ్లాఘనీయులు.

ధనికరైతు పాత్రధరించిన అచ్చయ్యగారితో పోల్చగల సమర్థులైన నటులు ఆంధ్ర దేశంలో వ్రేళ్ళమీద లెక్కించదగిన ఏకొద్ది మందో ఉన్నారంటే అతిశయోక్తికాదు. పురుషులు స్త్రీ పాత్ర ధరించి నిర్వహించడం చాల కష్టమైనపని. అయినా విమల పాత్రధారి వల్లం నరసింహారావుగారు, కాంతమ్మ పాత్రధారి సూరపనేని లక్ష్మీపెరుమాళ్ళుగారు మంచి సమర్థతతో తమ పాత్రలను నిర్వహించారు. జమీందారు మొదలుకొని బంట్రోతు వెంకన్న వరకు తమ తమపాత్రలను మంచిహుందాగా నడిపించారు. ఒక యంత్రానికి చక్రం ఎంత ప్రాధాన్యమో, చిన్నమరమేకుకూడా అంత ప్రాముఖ్యమే. ఏదిలేకపోయినా, యంత్రం కదలదు. అలాగేనాటకంలో చిన్నపాత్రధారుల్ని నిర్లక్ష్యంచేస్తే ఆ నాటకఔచిత్యానికి భంగం కలుగుతుంది. అలాంటి అపకీర్తి రానీయకుండా, చక్కగా నటించిన తక్కిన నటకులందరూ ప్రశంశనీయులు.

సంగీత దర్శకులైన చలపతి సోదరులను ప్రశంసించకుండా ఉండలేము. ఉత్తమ వాయిద్య పరికరాలను ఇంకా సంపాదించుకొంటే, వీరి దర్శకత్వాన సంగీతం మరింత రాణించుతుందని భావించుతున్నాం. వర్ణ బాటు చేసికోదగిన చిన్ని లోపాలున్నా అవి అంతగా లెక్కించవలసినవిగావు.

ఆంధ్ర నాటకరంగంలో, ఆంధ్ర అభ్యుదయ పారవశ్యంలో, ఒకడుగు ముందుకు వేసిన ఈ "ముందడుగు" నిఖిలాంధ్రజనుల ప్రశంసలను పొందుతుందని ఆశించుతున్నాం.

ప్రజా పక్షానికి విజయం

—★★★—

తాడికొండ పంచాయితీబోర్డు ఎన్నికలు

ఈ గ్రామం 10 వేల జనాభా కలది. పంచాయితీబోర్డు వుంది. పూర్వం యీబోర్డు జస్టిస్‌పార్టీకి అండగా వున్నవారి చేతుల్లో వుండేది. పరిపాలన సరిగాలేక, రద్దుచేయబడింది. మొన్నజూలై 23వ తేదీన తాడికొండ పంచాయితీబోర్డుకు ఎన్నికలొచ్చాయి.

కానియిపుడు గ్రామంలోపరిస్థితులు పూర్వం మాదిరిగాలేవు. ప్రజలలో రాజకీయచైతన్యం ఏర్పడింది. రైతుసంఘం, వ్యవసాయకూలీ సంఘం, యువజన, మహిళాసంఘాలు-ఏర్పడి చక్కగా పనిచేస్తున్నాయి. యువకులైన కామ్రేడ్లు ప్రజాసేవకు పూనుకున్నారు. బియ్యం దొరకని రోజుల్లో దొంగమార్కెటును ఆపుజేసారు. అదనం కోటాకొరకు ఆందోళనచేసి, వచ్చిన సరుకును సక్రమంగా ప్రజలకు పంచారు. కిరోసిన్ కోటానుకూడా న్యాయంగా పంచుతున్నారు. కో-ఆపరేటివ్ స్టోర్సును స్థాపించి జీవితావసర వస్తువులన్నీ సక్రమధరలకు అందజేస్తున్నారు. గ్రంధాలయాభివృద్ధికి, పాఠశాల భవన నిర్మాణానికి కృషిచేశారు.

ప్రజల చైతన్యంచూచి, ప్రజాసేవచేస్తున్న యువకులనుజూచి ఇదివరకు పెత్తనంచేస్తున్న వారికి కిహతహలు పుట్టాయి. పూర్వమంచి స్వాతంత్ర్యోద్యమానికి కాంగ్రెసుకు విరోధులైన ప్రబుద్ధులు నేడు హఠాత్తుగా కాంగ్రెసు బురఖా తగిలించుకున్నారు. తాము కమ్యూనిస్టుపార్టీతో పోటీచేస్తున్నామంటూ జిల్లా కాంగ్రెస్‌నాయకులసహాయం తెచ్చుకున్నారు. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు ఎలెక్షన్ ప్రచారకుడుగా వెళ్ళారు. నేటికీ జస్టిస్‌పార్టీ వ్యవసాయసంఘ అగ్రనేతగా వున్న గోగినేని నాగేశ్వరరావు ప్రత్యర్థులకు కాంగ్రెసు నామకరణంచేశారు దేశభక్తులు. "ఈ కాంగ్రెసువాదులకే ఓటివ్వండి; కమ్యూనిస్టులకు యివ్వొద్దు" అంటూ ప్రచారం చేశారు. ప్రజలు ముక్కుమీద వ్రేలేసుకొన్నారు. ప్రజావ్యతిరేకులు కాంగ్రెసువాళ్లెలా అయ్యారు? "ప్రజాసేవకులైన కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా జస్టిస్‌పార్టీ ప్రముఖుల్ని బలపరచడం యీ ముసలాయనకు తగినపని కాదను"కున్నారు ప్రజలు.

కాని ఎవరేమిచేసినా, ప్రజాసేవకులకు ప్రజల హృదయంలో ఎల్లపుడూ స్థానం వుంటుంది. కామ్రేడ్స్ గోరంట్ల పున్నయ్య, అడ్డమిల్లి వెంకయ్యగారలు పోటీలేకుండానే ఎన్నుకోబడ్డారు. కామ్రేడ్స్ కొల్లూరు వెంకటేశ్వర రావు, త్రిపురనేని శేషయ్య, కాశెట్టి రామయ్య, ఆశీర్వాదంగారలు పోటీలో జయం పొందారు. వెంకటప్పయ్య పంతులుగారి ప్రచారం అరణ్యరోదనమయింది. ప్రశంసలేవీ ఫలం దక్కలేదు.

బోర్డుసభ్యుల మొత్తంసంఖ్య 16. అందులో 6 గురు కామ్రేడ్స్ వచ్చారు. ఏపక్షానికి చెందని గ్రామ శ్రేయోభిలాషులు 6 గురు నెగ్గారు. తక్కినవారు "కాంగ్రెసు బురఖా" తగిలించుకున్న గోగినేని నాగేశ్వరరావు ముఠావారు వచ్చారు.

10 వేల జనాభాలో 900 మందికిమాత్రమే ఓట్లున్నాయి. ప్రజాసామాన్యాని కందరికీ ఓట్లులేవు. నాగేశ్వరరావుపక్షం 'నోట్లు' ఖర్చుపెట్టారు. బీదలను, రజకులను, కుమ్మరులను బెదిరించారు; "దేశభక్తుడు" బాకా వూదారు. అయినప్పటికీ ప్రజాసేవకులే జయం పొందారు. ధర్మం జయించిందని ప్రజలు సంతసించారు.

చీరాల విద్యార్థుల కష్టాలు

★

అన్ని పాఠశాలలో లాగానే, చీరాల హైస్కూలులో కూడా విద్యార్థులకు సీట్లు దొరకక ఇబ్బంది పడుతున్నారు. గత సంవత్సరంకూడా ఈ ఇబ్బంది వచ్చింది. అపుడు కొంతమందికి అయినా ఏలాగో సీట్లుఇచ్చారు; కాని ఈ సంవత్సరంగా కొత్తగా చేర్చుకొనే ప్రతివిద్యార్థి వద్ద 10 రూపాయలు షెడ్డుల నిర్మాణంకోసం వసూలు చేస్తున్నారు. రెండు సంవత్సరాలనుండి ఈ ఇబ్బందివున్నా జిల్లా బోర్డు ఇప్పటివరకు ఏమీచేయక పోవడం విచారకరం.

పేద విద్యార్థులు అదనంగా ఈ 10రూపాయలు సమర్పించుకోలేక అవస్థపడుతున్నారు. ఈ విషయంలో పౌరుల వద్దనుండి, ఇచ్చుకోగల విద్యార్థులనుండి షెడ్ల నిర్మాణ నిమిత్తం, పురప్రముఖులు, విద్యార్థిసంఘం కలిసి ధనం వసూలు చేయడం మంచిది. అందుకు జిల్లాబోర్డుకూడా చేయూతనిచ్చి, తమ బాధ్యతను నెరవేర్చాలి. ధన లోపంవల్ల బీద విద్యార్థులకు సీట్లు దొరకని అవస్థ పోవాలి.

ఇంతేగాక విద్యార్థులు తాము కోరుకున్న ఆప్షనల్ సబ్జక్టులలో సీట్లు లభించడంలేదు. ఈ విషయంలోకూడా హైస్కూలు అధ్యాపకులూ, జిల్లాబోర్డువారూ తగుచర్య తీసుకోవాలని ప్రార్థన.

లక్ష్మణరాయ వర్ధంతి

★

జూలై 18 న తేదీన శ్రీకొమర్రాజు లక్ష్మణరాయ వర్ధంతి బెజవాడ, గుంటూరు, భీమవరం, వరంగల్, పామర్రులలో జయప్రదంగా జరిగింది. లక్ష్మణరావుగారి జీవిత విశేషాలను, వారు "విజ్ఞానచంద్రికా గ్రంధమండలి"ద్వారా, చారిత్రక పరిశోధనలద్వారా చేసిన సేవను ప్రశంసిస్తూ పలువురు ప్రముఖులుఉపన్యసించారు. విజ్ఞానసర్వస్వముపూర్తి చేయించాలని, లక్ష్మణరావుగారు కొనసాగించిన "విజ్ఞాన చంద్రికా పరిషత్తు" లాంటివి స్థాపించి వయోజన విద్యను, జాతీయవిద్యను ప్రోత్సహించాలని కొందరు సూచించారు.

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet · Beswada.

END OF ISSUE